మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట





మాట్లాడుతున్న విసి శ్రీనివాస్

# సాఫ్ట్ స్కిల్స్ కలిగి ఉండాలి

## విద్య,ఉపాధి,వ్యాపార రంగాలలో ప్రాధాన్యత పియువీసీ ఆచారి శ్రీనివాస్

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 21 ప్రభాతవార్త:** విద్యా, ఉపాధి వ్యాపార రంగాలలో అభివృద్ధి చెందాలంటే సాఫ్ట్ స్కిల్స్ పై పట్టు సాధించాలని పాలమూరు విశ్వవిద్యాలయ వైస్ ఛాన్స్‌లర్ శ్రీనివాస్ తెలిపారు. పాలమూరు యూనివర్సిటీలో ఫార్మసి కాలేజ్ ఆడిటోరియంలో ఎంసీఏ అండ్ ఎంబీఏ విభాగాలు సంయుక్తంగా సాఫ్ట్ స్కిల్స్, ఉద్యోగ అవకాశాలపై నిర్వహించిన రెండు రోజుల కార్యశాల శనివారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ఉపకులపతి ఆచార్య శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం ప్రతి రంగంలో విజయం సాధించాలంటే, కేవలం సాంకేతిక నైపుణ్యాలు మాత్రమే కాదు, మంచి సాఫ్ట్ స్కిల్స్ ఉండాలని, విద్య, శిక్షణ కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లు నిర్వహించడం వల్ల సాఫ్ట్ స్కిల్స్ ను మెరుగుపర్చడం, ఉద్యోగులు తమ పనిలో పెరుగుదలకు దోహదం చేస్తాయని అన్నారు. మ్యాజిక్ రెడ్బస్ తాఫిక్ అహ్మద్ భారీ కార్పొరేట్ సంస్థలకు అవసరమైన స్కిల్స్ ని ఏ విధంగా పెంపొందించుకోవాలో, రెస్యూమ్‌ని ఎలా తయారు చేయాలో వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. చంద్రకిరణ్, ఎంసీఏ విభాగాధిపతి డా. గౌస్మొయిద్దీన్ , ఎంబీఏ విభాగాధిపతి డా.నాగసుధ, అధ్యాపకులు డా.అర్జున్ కుమార్, డా.సబితా, డా.జావేద్ ఖాన్, డా.అరుంధతి, ఎంసీఏ ఎంబీఏ విద్యార్థులు పాల్గొన్నారు.

# నీట మునిగి.. ముగ్గురు మృతి

**తల్లితో సహా ఇద్దరు చిన్నారుల మృత్యువాత**

**చెరువులో బట్టలు ఉతకడానికి వెళ్లి ప్రాణం వదిలారు**

**మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలం పోమాల్ వద్ద ఘటన**



తల్లి సహా ఇద్దరి చిన్నారుల మృతదేహాలు

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 21 ప్రభాతవార్త:** బట్టలు ఉతకడానికి పిల్లలతో కలిసి చెరువు వద్దకు వెళ్లిన తల్లితో సహా ఇద్దరు పిల్లలు చెరువులో మునిగి ప్రాణాలు కోల్పోయిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలం పోమాల్ గ్రామం పెద్ద చెరువు వద్ద చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే గ్రామానికి చెందిన సరోజ తన ముగ్గురుపిల్లలతో కలిసి పెద్దచెరువు వద్దకు చేరుకుంది. ఈ క్రమంలో ఆమె బట్టలు ఉతుకుతుండగా ముగ్గురు పిల్లలు ఆడుకుంటూ చెరువులోకి జారిపోయారు. తన బిడ్డలను కాపాడేందుకు వెళ్లి తల్లి కూడా చెరువులో మునిగిపోయింది. ముగ్గురు పిల్లల్లో తేజ అనే చిన్నారి ప్రాణాలతో బయటపడగా తల్లి సరోజతో సహా ఇద్దరు పిల్లలు నీట మునిగిపోవడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ముక్కుపచ్చలారని పసిబిడ్డలతో పాటు తల్లి కూడా చెరువులో ప్రాణాలు వదలడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులంతా కన్నీటి పర్యంతమయ్యారు.

## పగలు యంత్రాలతో ఎత్తిపోతలు

# రాత్రి వేళల్లో టిప్పర్లతో తరలింపు

**అధికారుల అండదండలతోనే అక్రమంగా ఇసుక రవాణా తరలింపు**



వాగులో ఇసుక డంపులు

**ఖిల్లాఘణపురం డిసెంబరు 21 ప్రభాతవార్త :** పగలు యంత్రాలతో ఇసుకను ఎత్తిపోస్తూ రాత్రిళ్ళు టిప్పర్లతో అక్రమంగా ఇసుక తరలిస్తున్న సంఘటన గత నెల రోజులుగా జోరుగా సాగుతోంది. మండల పరిధిలోని మలికినియాన్ పల్లి గ్రామ శివారు పిల్లి వాగు ఘణపురం మహబూబ్‌నగర్ ప్రధాన రహదారికి ఆనుకుని వెళుతుంది. వాగులో పట్టా భూములు ఉన్న రైతులు గతంలో ఎద్దుల బండ్ల సహాయంతో గృహ నిర్మాణ కోసమని తరలించేవారు. గత వర్షాకాలం కురిసిన భారీ వర్షాలకు పిల్లి వాగు ఇసుకతో నిండిపోయింది ఇదే అదునుగా భావించిన కొందరు ఇసుక దందా మొదలుపెట్టారు. ఉదయం పూట జెసిబి లతో వాగు పైకి ఎత్తిపోస్తున్నారు. రాత్రి వేళల్లో జెసిబి టిప్పర్ల సహాయంతో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. నెలరోజుల క్రితం కొందరు స్థానిక తహశీల్దార్ దృష్టికి ఇసుక కుప్పల విషయం తీసుకువెళ్లగా తగిన చర్యలు తీసుకుంటామని మిన్నకుండిపోయారు. వాగులో కింది భాగంలో ఉన్న రైతులు జెసిబి లు హిటాచిలతో గుంతలు తీస్తుండటంతో వాగు పైన ఉన్న రైతుల పొలాలు వర్షాకాలంలో కోతకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిల్లి వాగులో నీళ్లు వస్తున్నాడంతో జెసిబి తో ఇసుక తోడితే రెండు రోజుల్లో మళ్లీ పై భాగం నుండి ఇసుక వచ్చి గుంతలు నిండిపోతున్నాయి. దీంతో పైన ఉన్న రైతులు తమ పొలంలో ఉన్న ఇసుకతో పాటు పొలాలు కోతకు గురవుతున్నాయని ఆ వేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీస్ స్టేషన్‌కు కూత వేట దూరంలోనే అక్రమ ఇసుక రవాణా రాత్రివేళల్లో జోరుగా సాగుతుందని రాత్రి వేళల్లో పెట్రోలింగ్ చేయకపోవడంతో అక్రమంగా ఇసుక తరలించే వారికి అడ్డు అదుపు లేకుండా పోయిందని జిల్లా స్థాయి రెవెన్యూ పోలీస్ అధికారులు కల్పించుకుని అక్రమంగా ఇసుక తరలించకుండా తగిన చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

## మహబూబ్‌నగర్‌ను

# అగ్రస్థానంలో నిలపాలి

**మహిళా సంఘాలు వినూత్న ఆలోచనలతో**

**కార్యక్రమాలు చేపట్టాలి**

**మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేంద్ర బోయి**



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 21 ప్రభాతవార్త:** మహిళా స్వయం సహాయక సంఘాలు వినూత్న ఆలోచనలతో వైవిధ్య కార్యక్రమాలు చేపట్టి మహబూబ్ నగర్ జిల్లాను అగ్రస్థానం లో నిలుపాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం లో గ్రామ సంఘాలు,మండల మహిళా సమాఖ్యలకు నూతన బైలాస్ గురించి డిపిఎంలు, ఏపిఎంలు, సిసిలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా స్వయం సహాయక సంఘాల కు బ్యాంక్ లింకేజి కింద ఆర్థిక స్వావలంబన కు రుణం మంజూరు లక్ష్యం జనవరి 15 నాటికి పూర్తి చేయాలని అన్నారు.



హాజరైన అధికారులు

బ్యాంక్ లింకేజి కింద ఆర్థిక సహాయం అందించడం లో జిల్లా వెనుకబడి ఉందని,381 కోట్ల రూ.లకు గాను 280 కోట్ల రుణం అంద చేసినట్లు ,జనవరి 15 నాటికి లక్ష్యం పూర్తి చేయాలని అన్నారు కమ్యూనిటీ పెట్టుబడి నిధి,స్త్రీ నిధి రుణ రికవరీ మెరుగు పరచాలని అన్నారు. మహిళా శక్తి కార్యక్రమం కింద ప్రభుత్వం మహిళల కోసం వివిధ కార్యక్రమాలు చేపట్టిందని అన్నారు. మహిళా శక్తి కార్యక్రమం కింద ఆయా మండలంలలో చేపట్టిన కార్యక్రమాలు సమీక్షించారు. సవరించిన మార్గదర్శకాల మేరకు స్త్రీనిది ద్వారా పాలిచ్చే గేదెలు యూనిట్‌లు పూర్తి చేయాలని అన్నారు. మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజి రుణంకు ఎంసిసిలు బ్యాంక్ లకు సకాలంలో అందించాలని అన్నారు. డిఆర్‌డిఓ నర్సింహులు మాట్లాడుతూ అజీనికా డిజిటల్ డేటాను అప్లోడ్ చేయాలని అన్నారు. బైలాస్ పై గ్రామ సంఘాలు, మండల సమాఖ్యలు మహిళా సంఘాల సభ్యులు అవగాహన కలిగించాలని అన్నారు. ఇంకా స్వయం సహాయక సంఘాలలో సభ్యులుగా చేరని మహిళల్ని చేర్పించాలని అన్నారు ఈ సమావేశం లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, పిడి జోజప్ప తదితరులు పాల్గొన్నారు.

## పేట కస్తూర్బా గాంధీ విద్యాలయం ఎదుట

# విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

**నారాయణపేట,డిసెంబరు 21 ప్రభాతవార్త :** పిల్లలను కలవడానికి వచ్చిన తల్లిదండ్రులకు పర్మిషన్ ఇవ్వకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు నారాయణపేట జిల్లా కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. విద్యార్థుల తల్లిదండ్రులకు విద్యార్థి సంఘాల నాయకులు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు సమ్మెలో ఉండడంతో. కస్తూర్బా గాంధీ బాలికల,కళాశాల పాఠశాలలో గత పది రోజులుగా విద్యార్థులకు క్లాసులు జరగకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్న పరిస్థితి ఉన్నదన్నారు. ఈ పది రోజులలో రాష్ట్ర ప్రభుత్వం జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించిన పరిస్థితి లేదనేది స్పష్టంగా అర్థం అవుతున్నదన్నారు.3వ శనివారం కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు అంతా హాస్టల్ దగ్గరికి రావడం జరిగింది. ఉదయం 10:30 నుంచి తల్లిదండ్రులంతా అంతా అక్కడనే వెయిట్ చేసినా వాళ్ల పిల్లలతో మాట్లాడడానికి విద్యార్థులను బయటికి వదలకపోవడంతో తల్లిదండ్రులంతా కోపంతో మా పిల్లల్ని మమ్మల్ని కలవనివ్వరా మాట్లాడనివ్వరా అని, హాస్టల్ ముందు యాదిగిరి మెయిన్ రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు.ఈరాస్తారోకోకు పిడిఎస్‌యు, ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘాలు మద్దతు తెలిపారు. దాదాపు గంటసేపు రాస్తారోకో నిర్వహించిన విద్యాశాఖకు సంబంధించిన అధికారులు ఎవరూ రాకపోవడంతో, అలాగే కూర్చుంటామని మొండికేసి కూర్చున్నారు. దీంతో రంగ ప్రవేశం చేసిన పోలీసులు విద్యార్థుల్ని కలవాలంటే పర్మిషన్లు కావాలి అనుమతి తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులతో దురుసుగా ప్రవర్తించారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు కోపంతో వారు మమ్మల్ని రమ్మనలేదు స్వచ్ఛందంగా మేమే వచ్చి కూర్చున్నాం మా పిల్లల్ని కలవడానికి మాకు పర్మిషన్లు కావాలని పోలీసులని నిలదీశారు. దీనితో పోలీసులు చేసేది ఏమీ లేక విద్యాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని చెప్పడంతో రాస్తారోకు విరమించడం జరిగింది. ఇప్పటికే టెన్త్ క్లాస్ ఎగ్జామ్ షెడ్యూల్ కూడా వచ్చి ఉన్నది. విద్యార్థులకు క్లాసులు జరగకపోవడంతో తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉన్నది. తక్షణమే సర్వశిక్షన్ అభియాన్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించి , విద్యార్థులకు క్లాసులు బోధించే రకంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారులు చర్యలు తీసుకోవాలని పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు ఎస్.సాయికుమార్ , ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నరహరి అన్నారు. పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు గౌస్ , జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్ ,నాయకులు సురేష్ , ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పవన్ పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

# క్లీనిక్ సీజ్..



ఆర్ఎంపి క్లినిక్‌కు సీజ్ చేసిన దృశ్యం

**అడ్డాకుల, డిసెంబరు 21 ప్రభాతవార్త :** అర్హతకు మించి వైద్యం చేస్తున్న ఆర్ఎంపి క్లినిక్ ను మూసివేసినట్టు జిల్లా మాస్ మీడియా అధికారి గంగసాని మంజుల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అడ్డాకుల మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఉన్న అన్వర్ (ఫస్ట్ ఏయిడ్ సెంటర్) క్లినిక్ లో అర్హతకు మించి సెలైన్ బాటిల్ ఎక్కించడం, యాంటీ బయోటిక్ మందులు ఇవ్వడం జరుగుతున్నందున క్లినిక్ మూసేసినట్లు వివరించారు. శనివారం మధ్యాహ్నం అన్వర్ క్లినిక్ లో జిల్లా మెడికల్ అండ్ హెల్త్ అధికారి తనిఖీలు చేయగా ఒక వ్యక్తికి సెలైన్ బాటిల్ ఎక్కిస్తూ పట్టుబడడం, యాంటీబయాటిక్ మందుల చిట్టీలు బయటపడడంతో క్లినిక్‌ను మూసివేసినట్టు పేర్కొన్నారు. ఆర్ఎంపీ డాక్టర్లు ఫస్ట్ ఎయిడ్ చికిత్స మాత్రమే చేయాలని, అంతకుమించి సెలైన్ బాటిల్ ఎక్కించడం, యాంటీబయోటిక్ మందులు రాయడం, వంటి కార్యకలాపాలు నిర్వహించినట్లు రుజువైతే వారిపై కేసులు నమోదు చేసి, లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు.

# మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డికి పితృవియోగం

**- నివాళులు అర్పించిన మాజీ మంత్రులు,మాజీ ఎమ్మెల్యేలు, ప్రముఖులు**

**- స్వగ్రామం నేరెళ్లపల్లిలో అంత్యక్రియలు**



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబరు 21 ప్రభాతవార్త :** నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి తండ్రి మర్రి జంగిరెడ్డి శనివారం తెల్లవారుజామున తుది శ్వాస వదిలారు. తిమ్మాజీపేట మండలం నేరేళ్లపల్లి స్వగ్రామంలో జంగిరెడ్డి అంత్యక్రియలు శనివారం మధ్యాహ్నం నిర్వహించారు. మర్రి జనార్ధన్‌రెడ్డి నివాసంలో పెద్దఎత్తున హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు జంగిరెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మర్రి జనార్దన్ రెడ్డిని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, డాక్టర్ లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, భీరం హర్షవర్ధన్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, వంటేరు ప్రతాప్‌రెడ్డి, నాగం శశిధర్‌రెడ్డి, మాదాషీ విజయ్‌కుమార్, బీజేపీ నాయకులు దిలీప్ చారి, సిపిఐ రాష్ట్ర నాయకులు ఆనంద్‌జిలతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రముఖులు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యేలు

# మంచుదుప్పటి..



జడ్చర్ల డిగ్రీకాలేజీ గ్రౌండ్‌లో..



కందనూలులో ఉదయం 7:22



కందనూలులో ఉదయం 9:11





నాగర్‌కర్నూల్ బస్టాండ్‌లో..

**ఉమ్మడి పాలమూరు జిల్లాను మంచు కమ్మేసింది. శనివారం ఉదయం 9:30 గంటల వరకు రోడ్లపై మంచు కురవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాహనదారులు లైట్లు వేసుకొని హారన్ మోగిస్తూ రాకపోకలు సాగించాల్సి వచ్చింది. చాలా చోట్ల చలిమంట వేసుకొని ఉపశమనం పొందారు. గత వారం రోజులుగా ఉష్ణోగ్రతలకు కూడా 8 డిగ్రీలకు పడిపోవడం కొంత ఆందోళన కలిగిస్తున్నది. పొగ మంచు కురిసే సమయంలో చిన్న పిల్లలు, వృద్ధులు సాధ్యమైనంత మేరకు బయటకు రాకుండా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.**

**– మహబూబ్‌గర్ బ్యూరో, డిసెంబరు 21 ప్రభాతవార్త**

# యజమాన్యం నిర్లక్ష్యంతో విద్యార్థి మృతి..!

- **ఆందోళన చేపట్టిన విద్యార్థి సంఘం నాయకులు, ఆయా పార్టీ నాయకులు..**
- **మూడు గంటల పాటు రోడ్డుపై బైఠాయింపు...**
- **రంగంలోకి దిగిన డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ కృష్ణ**
- **విద్యార్థి చావుపట్ల స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యం...**



మృతి చెందిన కొడుకును చూసి రోదిస్తున్న తల్లి

**వనపర్తి క్రైమ్ డిసెంబరు21 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రం సమీపంలో ఉన్న పెబ్బేర్ రహదారి సమీపంలో ఉన్న రేడియంట్ పాఠశాలలో విద్యార్థి విద్యుత్ ఘాతకానికి మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. పలువురు వివరాల ప్రకారం వనపర్తి జిల్లా చిన్నంబాయి మండలం పెద్ద మారు గ్రామానికి చెందిన శిరీష ,భాస్కర్ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. హరీష్ (15), గౌతమ్ ఇద్దరు ఒకే దగ్గర వనపర్తి రేడియంట్ పాఠశాల హాస్టల్ లో ఉండి విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. 9వ తరగతి చదువుతున్న హరీష్, లోకేష్ లు ఎవరికి తెలియకుండా ఉదయాన్నే పాఠశాల పక్కనే ఉన్న వేరుశనగ పొలం వద్దకు వెళ్లారని పోలానికి పెట్టిన కరెంటు వైర్లు గమనించని హరీష్ వేరుశనగ కోసం దాటేందుకు ప్రయత్నిస్తుండగా విద్యుత్ వైర్లు తగిలి అక్కడికక్కడ మృతి చెందాడు. జరిగిన సంఘటన గురించి మరో విద్యార్థి వెంటనే పాఠశాల యజమానానికి –మిగతా4లో..



రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపడుతున్న విద్యార్థి సంఘం నాయకులు

## మహాసభలను విజయవంతం చేయండి

**గోడపత్రికను ఆవిష్కరించిన హెచ్‌ఎం శ్రీహరి ప్రసాద్**


గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ నేతలు

**కోయిలకొండ, డిసెంబరు 21 ప్రభాతవార్త :** రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ఆరవ వైద్య వైజ్ఞానిక మహాసభల గోడపత్రిక ను మండలంలోని వింజమూరు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీహరి ప్రసాద్ గోడపత్రికను ఆవిష్కరించారని మండల టీఎస్ యుటిఎఫ్ అధ్యక్షులు మొగులయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య వైజ్ఞానిక మహాసభలు నల్గొండలో ఈనెల 28, 29,30, నిర్వహించడం జరుగుతుందన్నా రూ. ఈ మహాసభలలో విద్యారంగంపై మేధావులతో లోతైన చర్చ జరగబోతుందన్నారు. ఇట్టి మహాసభల కు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల టీఎస్ యుటిఎఫ్ ఉపాధ్యాయ నేతలు ఎల్లప్ప, వెంకట్రావు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలి

**ఆర్డీఓకు వినతి పత్రం అందజేసిన యువజన కాంగ్రెస్ శ్రేణులు**


ఆర్డీఓ కు వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

**ఉప్పునుంతల,డిసెంబర్ 21 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉప్పునుంతలలో మండల స్థాయి క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేయాలని శనివారం మండల యువజన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అచ్చంపేట రెవెన్యూ డివిజన్ అధికారిణి మాధవి కి వినతి పత్రం అందజేశారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయానికి ఆర్‌డిఓ హాజరు కావడంతో మండల కేంద్రంలో క్రీడా ప్రాంగణం లేకపోవడంతో క్రీడరంగంలో వెనుకబడి పోతున్నామని,గత 15సంవత్సరాల నుంచి క్రీడలలో వెనుకబడిపోతున్నామని పేర్కొన్నారు.క్రీడా ప్రాంగణం ఏర్పాటుచేస్తే యువత పక్కదారి పట్టకుండా ఎంతో దోహదపడుతుందని ఫిర్యాదులో పేర్కొన్నారు.అచ్చంపేట రెవెన్యూడివిజన్ అధికారిణికి వినతిపత్రం అందజేసిన వారిలో జిల్లా యువజన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు వెల్టూరి రేణయ్య, అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రత్లావత్‌కృష్ణ,ఉమామహేశ్వర దేవస్థాన కమిటీ డైరెక్టర్ బొల్లె లక్ష్మయ్య, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధానకార్యదర్శి మొగిలి మహేష్,అంతటి శేఖర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు గోవింద్ సింగ్, బొల్లె రేణయ్య, అయ్యవారిపల్లి నరేందర్ రెడ్డి, ప్రవీణ్‌లు ఉన్నారు.

## ఘనంగా ప్రపంచ ధ్యాన దినోత్సవం


విద్యార్థులచే ధ్యానం చేయిస్తున్న ఉపాధ్యాయులు

**ఉప్పునుంతల, డిసెంబరు 21 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉప్పునుంతల ప్రాథమిక బాలురపాఠశాలలో ప్రపంచ ధ్యానదినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్బంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు గాజుల వెంకటేష్, చందన, సంగీతలు ధ్యానం చేయడం ద్వారా కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. ధ్యానం చేయడం ద్వారా ఒత్తిడి, ఆందోళనలు తొలగిపోయి మానసిక ప్రశాంతత చేకూరుతుందని , ఆత్మవిశ్వాసం పెరుగుతుందని మంచి అలవాట్లు అలవడుతాయని మనసును అదుపులో ఉంచి ఏకాగ్రత ఏర్పడుతుందని తద్వారా చేసే పనిలో విజయం సాధించవచ్చని విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు చదువుతోపాటు ధ్యానం చేయడంతో మానసికంగా ఆరోగ్యంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ నిత్యం సమయం కొద్ది ధ్యానం చేయాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులతో ధ్యానం చేయించారు.

## షార్ట్ సర్క్యూట్‌తో రెండు గుడిసెలు దగ్ధం

**గుర్లపల్లిలో భారీగా ఆస్తి నష్టం**

**మక్తల్, డిసెంబరు 21 ప్రభాతవార్త:** మక్తల్ మండలంలోని గుర్లపల్లిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో రెండు గుడిసెలు దగ్ధమై భారీగా ఆస్తి నష్టం సంభవించిన ఘటన శనివారం ఉదయం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నందికొండ మొగులప్ప, నందికొండ సందప్ప లు సొంత అన్నతమ్ముళ్లు. వీరు గ్రామంలో పక్కపక్కనే పూరి గుడిసెలు వేసుకొని జీవనం కొనసాగిస్తున్నారు. అయితే శనివారం ఉదయం మక్తల్ పట్టణంలోని పడమటి ఆంజనేయస్వామి దర్శనం కోసం కుటుంబాలతో కలిసి మక్తల్‌కు వెళ్లారు. ఈ క్రమంలోనే ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో షార్ట్ సర్క్యూట్ సంభవించి గుడిసెలు పూర్తిగా దగ్ధమయ్యాయి. స్థానికులు సమాచారం అందించడంతో గ్రామానికి చేరుకున్న బాధితులు గుడిసెలు పూర్తిగా కాలిపోవడంతో నిరాశ్రయులుగా మారి గుండెలు పగిలేలా రోదించారు. ఈ ఘటనలో మొగులప్పకు చెందిన రూ.2 లక్షల నగదు, నాలుగు తులాల బంగారం, సందప్పకు చెందిన లక్ష రూపాయల నగదు, రెండున్నర తులాల బంగారం, 10 తులాల వెండి ఆభరణాలతో పాటు ఇతర వస్తువులు, నిత్యావసర సరుకులు, దుస్తులు పూర్తిగా దగ్ధమయ్యాయి. బాధిత కుటుంబాన్ని మాజీ జడ్పిటిసి జి.లక్ష్మారెడ్డి, మాజీ ఎంపిటిసి జి.బలరాం రెడ్డిలు పరామర్శించారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని వారు కోరారు.

## ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా ఆహారోత్సవం


ఆహారోత్సవంలో మాట్లాడుతున్న అధికారులు

**కృష్ణ, డిసెంబరు 21 ప్రభాతవార్త :** ప్రతి నెల 3 వ శనివారం ప్రభుత్వ పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగే తల్లిదండ్రుల, ఉపాధ్యాయ సమావేశం లో భాగంగా నేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మూడుమాల్‌లో ఈ నెలలో విద్యాశాఖ సూచనల మేరకు ఆహారోత్సవ కార్యక్రమం, ప్రపంచ ధ్యాన దినోత్సవం, పిటిఎం సమావేశం ఘనంగా నిర్వహించారు. ఆహారోత్సవం కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల నుండి వివిధ రకాల ఆహార పదార్థాలను తెప్పించి వాటి తయా రీ, వాటి వల్ల లాభాలు, పౌష్టిక ఆహారం గురించి ఉపాధ్యాయులు వివరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందం పిల్లలకు ఎలాంటి ఆహారం ఇవ్వాలి అని తల్లిదండ్రులకు అవగాహనా కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆహార ప్రదర్శన ఆకట్టుకున్నది. ఈ ప్రదర్శనలో వివిధ రకాల స్వీట్‌లు, పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు వాటి ద్వారా తయారు చేసిన వాటిని ప్రదర్శన చేయడం పట్ల తల్లిదండ్రులు, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం కుర్మయ్య, జనార్దన్ రెడ్డి, శ్రీనివాస్, మాధవి, తిమ్మప్ప, తల్లిదండ్రులు చం ద్రశేఖర్, నర్సిములు, రామప్ప తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ క్రీడలకు ఎంపికైన ఆత్మకూర్ క్రీడాకారిణి


సమీనా బేగంను సన్మానిస్తున్న దృశ్యం

**ఆత్మకూరు డిసెంబరు 21 ప్రభాతవార్త :** ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యనభ్యసిస్తున్న సమీనా బేగం రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలలో అత్యంత ప్రతిభ కనబరిచి త్వరలో జరగనున్న జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లుగా వ్యాయామ ఉపాధ్యాయులు రాఘవేంద్రరావు విలేకరులకు తెలిపారు. ఈ మేరకు శనివారం రోజు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల లో జాతీయ స్థాయికి ఎంపికైన సమీనా బేగంను కళాశాల ప్రిన్సిపల్ భాగ్యవర్ధన్ రెడ్డి అధ్యాపక బృందం విశ్వేశ్వర్ తదితరులు క్రీడాకారిని ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జాతీయ స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచి ఆత్మకూరు పట్టణానికి పేరు ప్రతిష్టలు సంపాదించి పెట్టాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం జాతీయస్థాయి క్రీడలకు ఎంపికైన సమీనా బేగం కు కళాశాల ప్రిన్సిపాల్తో పాటుగా పలువురు ఉపాధ్యాయులు నగదు బహుమతిగా అందజేశారు.

## ధ్యానం తోనే మానసిక ఒత్తిళ్లు దూరం



**చిన్నచింతకుంట,డిసెంబరు25 ప్రభాతవార్త:** మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులచే ధ్యాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ధ్యానం శ్వాస మీద ధ్యాస అని ఇది ఒక దివ్య ఔషధం అని మానసిక ఒత్తిళ్లను నియంత్రించడానికి ధ్యానం ఒక మార్గమని, ప్రతి విద్యార్థి ధ్యానని అలవర్చుకోవాలని ఆయుష్మాన్ భారత్ సాధకులు శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రసన్న రాణి మాట్లాడు తూ ప్రతి విద్యార్థి వారి దైనందిన జీవితం లో ధ్యానాన్ని అలవర్చుకోవాలని, సంపూర్ణ ఆరోగ్యంతో పాటు ఆందోళన ఒత్తిడిని జయించడానికి ఏకైక మార్గం ధ్యానమే అన్నారు.

# ప్రారంభమైన శ్రీ సంతాన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు


ముస్తాబయిన సంతాన వేణుగోపాల స్వామి ఆలయం

**గద్వాల, డిసెంబరు 21 ప్రభాతవార్త :** కొలిచిన వారికి కొంగు బంగా రంగా విరాజిల్లుతు గద్వాలలోని భీంనగర్‌లోని అంబేద్కర్ సర్కిల్ లో కొలువైన శ్రీ సంతాన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్స వాలు శని వారం వైభవంగా ప్రారంభమైన్నాయి. స్వామి వారు భక్తులతో నిత్య పూజలు అందుకుంటున్నాడు. ప్రతి ఏడాది మార్గశిర మాసంలో స్వామి వారి బ్రహ్మోత్స వాలను సంస్థాన కాలం నుంచి వైభవంగా నిర్వహిస్తున్నారు. స్వామి వారి బ్రహ్మోత్స వాల సందర్భంగా నెలరో జుల పాటు గద్వాల చిన్నజాతర నిర్వహిస్తుంటారు. అదే ఆనవాయి తీని కొనసాగిస్తూ ఈ ఏడాది కూడ మూడు రోజుల పాటు బ్రహ్మోత్స వాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహక అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. స్వామి వారి బ్రహ్మోత్స వాలలో భాగంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేపట్టారు. ఆలయ చరిత్ర గద్వాల సంస్థానాధీశులు ప్రసిద్ధ ఆలయాలను నిర్మించారు. అందులో కోటలోని శ్రీ భూలక్ష్మి చెన్నకే శవ ఆలయం ప్రసిద్ధి చెందింది. అదే కోవలోకి చెందినదే శ్రీ సంతాన వేణుగోపాలస్వామి ఆలయం. స్వామి వారి విగ్రహాన్ని నల్ల సోమ నాద్రి ప్రతిష్ఠించగా ఆలయాన్ని గద్వాల సంస్థానంలో 6వ తరానికి చెందిన రాజా సీతారాంభూపాల్ తల్లిదండ్రులు భీంరెడ్డి, లక్ష్మినాంచా రమ్మ నిర్మించినట్లు చరిత్ర చెబుతుంది. నాటి నుంచి నేటి వరకు ఉత్స వాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం రాజవంశస్తులైన వెంకట సదాశివారెడ్డి భార్య సంయుక్తమ్మ, డాక్టర్ విక్రం సింహారెడ్డి, డాక్టర్ సుహాసిని రెడ్డి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు, ఉత్స వా లను వైభవంగా నిర్వహిస్తున్నారు. ప్రారంభమైన స్వామి వారి బ్రహ్మోత్స వాలు శ్రీ సంతాన వేణుగోపాల స్వామివారి బ్రహ్మోత్స వాలలో భాగంగా మొదటి రోజు శనివారం ఉదయం 10గంటలకు స్వామి వారికి పుణ్యహావాచనం, అంకురార్పణతో పూజా కార్యక్రమా లను ప్రధాన అర్చకులు సంవృత్ భరద్వాజ్, ఆలయ అర్చకులు రాఘవాచారి, పవన్ కుమార్, సంకర్షన్ భరద్వాజ్, సాత్విక్ భరద్వాజ్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉదయం 11 గంటలకు ధ్వజారోహణం, భేరీపూజ, హోమా లు నిర్వహించారు. సాయంత్రం 6గంటలకు స్వామి వారి కల్యాణోత్స వ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. డిసెంబర్ 22న ఆదివారం ఉదయం 10గంటలకు నిత్య హోమం, రాత్రి 6 గంటలకు స్వామి వారి రథోత్స వం, స్వామి వారి సేవ, ఊరేగింపు, రాత్రి 9 గంటలకు స్వామి ఊంజల్ సేవ, ప్రసాదవితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. డిసెంబర్ 23 సోమవారం ఉదయం 10 గంటలకు పారువేట, 3 గంటలకు తీర్థావళి, నాగవల్లి, పూర్ణాహుతి దేవతా విసర్జనలు తదితర కార్యక్రమాలు ఉంటాయని ఆలయ ప్రధాన అర్చకులు బోరవెల్లి సంవృత్ భరద్వాజ్, పవన్ కుమార్, రాఘవాచారి తెలిపారు. గద్వాల చిన్నజాతర పట్టణంలోని భీంనగర్‌లో గల సంతాన వేణుగోపాల స్వామి బ్రహ్మోత్స వాల సందర్భంగా జాతర నిర్వహిస్తారు. నెల రోజుల పాటు నిర్వహించు ఈ జాతర గద్వాల చిన్నజాతర, భీంనగర్ జాతరగా పిలుస్తారు. మిఠాయి దుకాణాలు, బొమ్మల దుకాణాలు, గాజులు, కుంకుమ, తదితర దుకాణాలు వెలిశాయి. ముఖ్యంగా ఈ జాతరకు ప్రత్యేకంగా మాంసం అంగళ్లు ఎక్కువగా వెలుస్తాయి. ఇవి ఆదివారం నుంచి భక్తులకు అందుబాటులోకి రానున్నాయి. జాతర దాదాపు నెల రోజుల పాటు సాగుతుంది. శ్రీ సంతాన వేణుగోపాల స్వామివారి బ్రహ్మోత్స వాలలో భాగంగా మొదటి రోజు శనివారం ఉదయం 10 గంటలకు స్వామి వారికి పుణ్యహావాచనం, అంకురార్పణతో పూజలు నిర్వహించారు. ఉదయం 11గంటలకు ధ్వజారోహణం, భేరీపూజ, హోమాలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు స్వామి వారి కల్యాణోత్స వ కార్యక్రమాలను నిర్వహించారు. డిసెంబర్ 22 న ఆదివారం ఉదయం 10 గంటలకు నిత్య హోమం, రాత్రి 6 గంటలకు రథోత్స వం, స్వామి వారి సేవ, ఊరేగింపు, రాత్రి 9 గంటలకు స్వామి ఉంజల్ సేవ, ప్రసాదవితరణ ఉంటుంది. డిసెంబర్ 23 సోమవారం ఉదయం 10 గంటలకు పారువేట, 3 గంటలకు తీర్థావళి, నాగవల్లి, పూర్ణాహుతి దేవతా విసర్జనలు తదితరులు కార్యక్రమాలు ఉంటాయని ఆలయ ప్రధాన అర్చకులు బోరవెల్లి సంవృత్ భరద్వాజ్ తెలిపారు.

# ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

**స్విట్స్‌లో ఘనంగా ఫ్రెషర్స్ డేలో స్విట్స్ కళాశాల డీన్ డా.కే.సుధాకర్**


స్విట్స్ లో ప్రసంగిస్తున్న డీన్ సుధాకర్

**దేవరకద్ర, డిసెంబరు21 ప్రభాతవార్త :** ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని స్వీట్స్ ఇంజనీరింగ్ కళాశాల డీన్ డా. కే. సుధాకర్ అన్నారు. దేవరకద్ర మండలం చౌదర్‌పల్లి సమీపంలోనున్న స్విట్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఎంబీఏ మొదటి సంవత్సరంలో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు చివరి సంవత్సరం విద్యార్థులు స్వాగతం పలుకుతూ ఘనంగా ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల సెమినార్ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో డీన్ సుధాకర్ ప్రసంగించారు. ఎంబీఏ చదివిన విద్యార్థులకు భవిష్యత్తులో ఉత్తమ స్థానం ఉంటుందన్నారు. ఈ రోజుల్లో ఏ కంపెనీ అయినా సరే ఒక వ్యక్తిని నూతనంగా ఉద్యోగంలోకి తీసుకోవాల్సినప్పుడు మౌఖిక పరీక్ష కీలకం అని అన్నారు. ఇది కేవలం ఎంబీఏ విభాగం వారు మాత్రమే ఈ అవకాశాన్ని పొందగలుగుతారన్నారు. కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్ ప్రసంగిస్తూ ఎంబీఏ పూర్తి చేసిన విద్యార్థులు మంచి కంపెనీలలో ఉద్యోగాలు సంపాదించి ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. ప్రస్తుతం ఎంబీఏ లో ప్రవేశం పొందిన విద్యార్థులు కూడా బాగా చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. కళాశాల వనరులను సక్రమంగా ఉపయోగించుకుని లబ్ధి పొందాలన్నారు. ఎంబీఏ విభాగపు అధిపతి శ్వేత ప్రసంగిస్తూ ఎంబీఏ విభాగపు ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. ఎంబీఏలో చాలా రకాల కోర్సులు ఉంటాయన్నారు. మార్కెటింగ్, ఫైనాన్స్, హెచ్‌ఆర్ ఇలా ఎన్నో రకాల కోర్సులు అందులో ఉంటాయన్నారు. ఇందులో ఏ కోర్సు చదివిన భవిష్యత్తులో మంచి విజయవకాశాలు పొందగలుగు తారన్నారు. ఈ కార్యక్రమంలో జయంతి ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు బాలీశ్వర్, ఉపాధ్యక్షుడు లక్ష్మీకాంత్ రెడ్డి, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, కోశాధికారి సూర్యనారాయణలతో పాటు ఆయా విభాగాపు అధిపతులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఉంద్యాల బీటీ రోడ్డును పూర్తి చేయాలి : బిజెపి నేతల డిమాండ్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి నేతలు

**చిన్నచింతకుంట, డిసెంబరు 21 ప్రభాతవార్త :** మండల కేంద్రం నుంచి నంద్యాల గ్రామానికి వెళ్లి బీటీ రోడ్డు పనులు అసంపూర్తిగా నిలిచాయని వెంటనే మిగతా రోడ్డు పనులను పూర్తి చేయాలని బిజెపి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి నంబిరాజు అసెంబ్లీ కన్వీనర్ కురువ రమేష్ లు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని బిజెపి కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ సీసీ కుంట నుంచి ఉంధ్యాల వరకు 5కిలోమీటర్ల 200 వందల మీటర్ల ఆర్‌అండ్‌బి రోడ్డుపై బీటీ వేసేందుకు పిఎంజిఎస్‌వై ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం క్రింద మంజూరు అయ్యి మూడు సంవత్సరాలు అయినా కూడా ఇప్పటి వరకు పనులు పూర్తి కాలేదు అన్నారు. ఈ రోడ్డు పనులకు గాను 3 కోట్ల యాభై లక్షలు నిధులు 2021 లో మంజూరై పనులు ప్రారంభమై 2023 వరకు పనులు పూర్తి కాలేదు అన్నారు అగ్రిమెంట్ ఉన్న అధికారుల తోపాటు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం తో ఇంకా కిలోమీటరున్నర రోడ్డు డ్యామేజ్ ప్యాచ్‌లు మిగిలి ఉన్నాయన్నారు. ఈ సారి కురుమూర్తి జాతరకు వచ్చే వేలాది మంది భక్తులు చాలా ఇబ్బందులు పడుతూనే వెళ్లారన్నారు. సీసీ కుంట మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్న అధికారులు కాంట్రాక్టర్ పనులు పూర్తి చేయడం లేదని వారు విమర్శించారు. పెండింగ్ లో ఉన్న రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు సోమవారం రోజున మిగిలి ఉన్న రోడ్డు పనులను పూర్తి చేయాలని డిమాండ్తో సీసీ కుంట మండల తహసీల్‌దార్ కార్యాలయం ముందు బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో బిజెపి మండల అధ్యక్షులు దశరథ్ బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ రాము నాయకులు రాములు, నరసింహ, మహేష్, నరేందర్, బాలచంద్రుడు, రుతుకుమార్ గౌడ్, చంద్రుడు, బాలస్వామి. బాలచందర్, చిట్టెన్న, శ్రీను పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేకు పిడిఎస్‌యు నాయకుల వినతి


ఎమ్మెల్యే చిట్టెం పర్ణికరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**నారాయణపేట టౌన్, డిసెంబరు 21 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలో (పీజీ) కళాశాలను ఏర్పాటు చేయాలి. బిసి హాస్టల్స్ లకు సొంత భవనాలను నిర్మించాలని కోరుతూ శనివారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో స్థానిక ఎమ్మెల్యే చిట్టెం పర్ణికరెడ్డికి పిడిఎస్ యు ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా పిడిఎస్ యు జిల్లా అధ్యక్షుడు ఎస్.సాయికుమార్ మాట్లాడుతూ నారాయణపేట జిల్లా కేంద్రంలో చదువుతున్న విద్యార్థులు పైచదువుల కోసం దూరా ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉన్నది. నారాయణపేట జిల్లాలో ప్రతి సంవత్సరం వేల సంఖ్యలో విద్యార్థులు డిగ్రీ పూర్తి చేసి పై చదువుల కోసం మహబూబ్‌నగర్, హైదరాబాదు లాంటి పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది. బీద మధ్యతరగతి విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ పై చదువులకు వెళ్లలేక మధ్యలోనే చదువు ఆపేస్తున్న పరిస్థితి ఈ ప్రాంతంలో ఉన్నది.గత ప్రభుత్వం (పీజీ)కళాశాల ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన ఈ ప్రాంత విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురాలేకపోయారు.ఈ ప్రాంత విద్యార్థులు ఉన్నతమైన చదువుల కోసం ఇతర పట్టణాలకు వెళ్లకుండా ఉండాలంటే, ఈ జిల్లాలో (పీజీ) కళాశాలను ఏర్పాటుచేసి తక్షణమే విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అనంతరం తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని స్థానిక ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి అందజేశారు. వినతి పత్రం అందించిన వారిలో పిడిఎస్‌యు జిల్లా సహాయ కార్యదర్శి బి.వెంకటేష్ , జిల్లా నాయకులు పార్వతి, నాయకులు తిరుమలేష్, అజయ్ ,బి.తిరుమలేష్, హేమలత, అరుణ తోపాటు తదిదారులు పాల్గొన్నారు.

# మహబుబ్‌నగర్ జిల్లా ద్వితీయ మహాసభలు విజయవంతం చేద్దాం

**తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కో కన్వీనర్ ప్రభాకర్ పిలుపు.. స్మృతి వనంలో కరపత్రం విడుదల**


మహాసభల కరపత్రికలు ఆవిష్కరణ చేస్తున్న రాష్ట్ర కన్వినర్ ప్రభాకర్

**గద్వాల, డిసెంబరు 21 ప్రభాతవార్త :** కోటి ఆశలతో తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నా తర్వాత ప్రజల ఆశలు ఆకాంక్షాలన్నీ అడి ఆశలైనాయని తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కో కన్వీనర్ ప్రభాకర్ అన్నారు. మలి దశ రాష్ట్ర సాధన ఉద్యమానికి ఊపిరి పోసిన తెలంగాణ ప్రజా ఫ్రంట్ ప్రజాస్వామిక తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం తెలంగాణ సమాజం ఏడు దశాబ్దాలుగా ఆ అలుపెరుగని పోరాటం చేసిందన్నారు. ఇప్పటికి చేస్తుందన్నారు అమరుల త్యాగాలతో, 1200 మంది విద్యార్థి యువకుల బలిదానాలతో,భౌగోళిక తెలంగాణ రూపంలో అది నెరవేరిందన్నారు. కానీ మొదటి నుండి తెలంగాణ ప్రజా ఫ్రంట్ దోపిడి పీడనలేని ప్రజాస్వామిక తెలంగాణఖై మహనీయుల ఆశయం సాధనకై ప్రజల పక్షాన పోరాడుతుందన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమం 1990 లలో ప్రారంభమైనదన్నారు. తెలంగాణ మేధావులు, రచయితలు,కవులు కళాకారులలో చర్చనీయాంశంగా కొనసాగుతున్న తెలంగాణ పదానికి 27 డిసెంబర్ 1997న ప్రజాస్వామిక తెలంగాణ డిక్లరేషన్ వరంగల్ గడ్డమీద ప్రజలు. ప్రజాస్వామిక వాదులు వరంగల్ డిక్లరేషన్ ప్రకటించారన్నారు. స్ఫూర్తిదాయకంగా, ప్రజాస్వామిక,ప్రత్యేక తెలంగాణకై మలిదశ తెలంగాణ ఉద్యమం తెలంగాణ వ్యాప్తంగా విస్తరిస్తున్న సందర్భంలో, ఆంధ్రవలస పాలకులు భయపడిపోయి ఉద్యమాన్ని ఆపాలని కుట్రలు చేశారన్నారు. తెలంగాణ గాన కోకిల బెల్లి లలిత, కనకాచారి,వనిపెంట వెంకటేశ్వర్లను,నరహంతక కిరాయి మూకలతో నరికి హత్య చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ క్రమంలోని ఎంతోమంది నికార్సైన తెలంగాణ ఉద్యమకారులను ఆంధ్ర పాలకులు బలి తీసుకున్నారన్నారు. అయినా ఉద్యమం ఆగలేదన్నారు. కామ్రేడ్ బెల్లిలలితతో పాటు అనేకమంది అమరుల త్యాగాల పునాదుల మీద ఏర్పడిన తెలంగాణ ప్రజా ఫ్రంట్ సకలజనుల సమ్మెలతో, మిలియన్ మార్చ్ ల తో తెలంగాణ ఊరు వాడ కదనరంగమై కదం తొక్కిందన్నారు.దశాబ్దాల తెలంగాణ ప్రజాస్వామిక తెలంగాణ రాష్ట్ర సాధన కల ఇంకా మిగిలే ఉన్నదన్నారు. తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా కన్వీనర్ (3)సుభాన్ పౌర హక్కుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు సుభాన్, తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్, ఇక్బాల్ పాలమూరు అధ్యయన వేదిక కన్వినర్ ఇక్బాల్ పాషా, టీవీవీ మాజీ నాయకులు నాగరాజు, మోహన్ దళిత ఐక్యవేదిక నాయకులు ఆర్ మోహన్, అఖిలపక్ష నాయకులు ఎన్ వెంకట్ రాములు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు అబ్దుల్ బాబు,పౌర హక్కుల సంఘం సభ్యులు మహేష్, హనుమంతు,అఖిలపక్ష నాయకులు,హన్మంతు వీరబాబు,తెలంగాణ రైతు సంఘం తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన పౌష్టికాహారంపై దృష్టి పెట్టాలి

**పాఠశాల హెచ్‌ఎం నర్సింహులు**

**కోయిలకొండ, డిసెంబరు 21 ప్రభాతవార్త :** విద్యార్థుల తల్లి దండ్రులు నాణ్యమైన పౌష్టికాహారంపై దృష్టి పెట్టాలని మండలంలోని ఇబ్రహీంనగర్ గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ కోళ్లనర్సింహులు సూచించారు. శనివారం పాఠశాలలో ఆహారోత్సవ పౌష్టికార అంశంపై విద్యార్థుల తల్లి దండ్రులతో సమావేశం నిర్వహించారు.తమ పిల్లలకోసం ప్రత్యేకంగా తయారుచేసిన సర్వపిండి సకినాలు,నువ్వులు,రాగి లడ్డు, మక్కా గారెలు, ఆకుకూరలు, తదితర పిండి వస్తువులను తయారుచేసుకొని రావడంతో విద్యార్థుల్లో ఆనందం వెల్లి విరిసింది. ఈ సమావేశానికి హాజరైన తల్లిదండ్రులను ఉద్దేశించి పాఠశాల హెచ్‌ఎం డా.కోళ్ల నర్సింలు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించడంతో వారు భవిష్యత్తులో శక్తివంతులుగా కాగలుగుతారన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఉపకార వేతనాలకు ధరఖాస్తూ చేసుకోండి

**గద్వాల,డిసెంబరు21 ప్రభాతవార్త:** సంవత్సరానికిగాను గద్వాల జిల్లాలోని ప్రభుత్వ లేక ప్రవేట్ పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న దివ్యాంగ విద్యార్థులు ఫ్రీ పోస్ట్ మెట్రిక్ ఉప కార వేతనాల కోసం నేటి నుండి జనవరి 15 2025 వరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లాసంక్షేమశాఖ అధికారి సునంద ఒక ప్రకటనలో తెలిపారు.సంబంధిత ప్రధానోపాధ్యాయులు తమ పరిధిలో చదువుతున్న దివ్యంగా విద్యార్థుల వివరాలను ఆన్లైన్ వెబ్సైట్‌లో దరఖాస్తు చేయాలని పేర్కొన్నారు.దరఖాస్తు చేసుకున్న సంబంధిత ధ్రువపత్రాలను జిల్లా సంక్షేమశాఖ అధికారి కార్యాలయం రూం నెం.33లో అందజేయాలని తెలిపారు.ఇతర సమాచార నిమిత్తం 9440170160 సంప్రదించాలని ఆమె సచించారు.

## న్యాయ వాదుల దీక్షకు మాల మహానాడు, టీపీఎఫ్ నాయకుల మద్దతు



**గద్వాల డిసెంబరు 21 ప్రభాతవార్త :** పిజేపి క్యాంపు ఆవరణలో కోర్టు భవనాల సముదాయం నిర్మాణానికి అవసరమైన 10 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని న్యాయవాదులు చేస్తున్న రిలే నిరాహార దీక్షకు మాలమహానాడు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కో కన్వీనర్ ప్రభాకర్ 4వ రోజు నిరసన కార్యక్రమానికి హాజరై మద్దత్తు ఇచ్చారు. న్యాయవాదుల దీక్షకు తమ మద్దత్తును ఇచ్చి మాట్లాడుతు ప్రజలకు అందుబాటులో ఉన్న చోటనే కోర్టు భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులు జయసింహా రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, విజయకుమార్, లత్తిపురం వెంకట్ రామిరెడ్డి, నాగరాజు, ఇస్మాయిల్, అధ్యక్షులు రఘురామి రెడ్డి,సుధాకర్, విజయామోహన్ రెడ్డి,ఇక్బాల్ పాషాలు దీక్షలో కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో బండల వెంకట్రాములు, గోపాల్ తదితరులు ఉన్నారు.

## మద్దిగట్లలో అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం

**భూత్పూర్,డిసెంబరు 21,ప్రభాతవార్త :** అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం సందర్భంగా శనివారం భూత్పూర్ మండలం మద్దిగట్ల పాథమికోన్నత పాఠశాలలలో విద్యార్థులు,ఉపాధ్యాయులు ధ్యాన కార్యక్రమం నిర్వహించారు.పాఠశాల ఉపాధ్యాయులు సత్తూర్ బాల్‌రాజ్‌గౌడ్,గోపాల్,సురేందర్,నరేందర్, కుర్మయ్య, రాఘవేందర్ తదితరుల నేపథ్యంలో దాదాపు వంద మంది విధ్యార్థులు పాఠశాల ఆవరణలో ధ్యానం నిర్వహించారు.విద్యార్థులకు చదువు,ఆటలు,పాటలతో పాటు ధ్యానం,యోగ చాలా అవసరమని పాఠశాల ఉపాధ్యాయుడు సత్తూర్ బాల్‌రాజ్‌గౌడ్ అన్నారు.విద్యార్థి శారీరక,మానసిక వికాసానికి యోగతో పాటు ధ్యానం ఎంతో అవసరమని పేర్కొన్నారు.ప్రతి పాఠశాలలో యోగ,ధ్యానం తరగతులు చాలా ఉపయోగపడతాయన్నారు.

## వేగవంతంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి చేయాలి


సర్వేను పరిశీలిస్తున్న తహసిల్దార్ ఎల్లన్న

**చిన్న చింతకుంట, డిసెంబరు 21 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలలో భాగంగా ఇందిరమ్మ ఇండ్ల సర్వేను మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలోని అధికారులు వేగవంతంగా పూర్తి చేయాలని మండల తహసిల్దార్ ఎల్లన్న సూచించారు. శనివారం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే తీరును పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తు చేసుకున్న వారిని ఇందిరమ్మ ఇండ్ల యాప్‌లో నమోదు చేయాలని, ఈ ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలన్నారు. అర్హులైన ఇండ్లులేని నిరుపేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంతోష్, బిల్ కలెక్టర్ ప్రసన్న, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు ఎస్ వెంకటేష్, శేఖర్, ఎండి గౌస్, స్వప్న, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీనివాస రామానుజన్ జయంతి



శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, డిసెంబరు 21 ప్రభాతవార్త:** కల్వకుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ రామిరెడ్డి అధ్యక్షతన శనివారం శ్రీనివాస్ రామానుజన్ 137వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ రామిరెడ్డి ఆధ్వర్యంలో శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రామిరెడ్డి మాట్లాడుతూ ప్రపంచ గణిత మేధావి, గణిత శాస్త్ర మాంత్రికుడు, భారతదేశ కీర్తి, ప్రతిష్టల్ని ప్రపంచ గణిత శిఖరాలపై ద్విగుణీకృతం చేశారనిఆయన పేర్కొన్నారు.విద్యార్థులు రామానుజన్‌ని ఆదర్శం గా తీసుకొని చక్కటి క్రమశిక్షణతో, పట్టుదలతో చదివి మంచి ర్యాంకులు సాధించి కళాశాలకు మంచి పేరు తేవాలని విద్యార్థులను ఆశీర్వదించారు.చిత్తుకాగితాలపె వేలాది మ్యాథమెటిక్స్ ఫార్ములాల్ని రాసినధీశాలి అని అన్నారు.అనంతరం కళాశాల విద్యార్థులు,లెక్చరర్స్ స్వతాగాఉత్తమ మ్యాథమెటిక్స్ లెక్చరర్ అయిన కళాశాల ప్రిన్సిపాల్ రామిరెడ్డికు శాలువాతో సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు రమకాంత్,మల్లేష్,రాజేష్, పరుషరాం, శ్రీనివాస్, భీమేశ్వర్, లక్ష్మికాంత్ సాగర్,మహబూబ్అలీ,లక్ష్మయ్యవిద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

**రాజాపూర్, డిసెంబరు 21 ప్రభాతవార్త :** రాజాపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఘనంగా శ్రీనివాసన్ రామానుజన్ జయంతి వేడుకలను నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ రావ్ ఆధ్వర్యంలో శ్రీనివాసన్ రామానుజన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాలలో గణిత ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో గణిత ఎగ్జిబిషన్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భారీ ఎత్తున విద్యార్థులు గణితనికి సంభందించిన సూత్రలను గణిత పరికారాలను ప్రదర్శించారు. 9వ తరగతి విద్యార్థిని స్రవంతి 134 గణిత సూత్రంను చక్కగా చెప్పడం జరిగింది. పలువురు విద్యార్థులు గణితానికి సంబంధించిన నృత్య ప్రదర్శన నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ మాట్లాడుతు విద్యార్థులు అందరూ రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకొని రాబోయే రోజుల్లో విద్యార్థులు గణిత శాస్త్ర నిపుణులు కావాలని తెలిపారు. పాఠశాల గణిత ఉపాధ్యాయులు హనుమప్ప, ఎల్లయ్య, వెంకటేశ్వర శెట్టి మాట్లాడుతూ రామానుజన్ జీవితం గణిత రంగంలో సాధించిన విజయాలను పురస్కరించుకుని 2012లో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ డిసెంబర్ 22ని జాతీయ గణిత దినోత్సవంగా ప్రకటించడంతో ఈ దినోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయి అని తెలిపారు. విద్యార్థులు గణితం మీద ప్రత్యేక శ్రద్ధ వహించాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రావు,ఉపాధ్యాయులు హనుమప్ప, సంజీవ్‌రెడ్డి, సరళ,పద్మావతి, దివాకర్, శ్రీనివాస్,శ్యామ్ సుందర్, ఎల్లయ్య ,రమాదేవి, వెంకటేశ్వర శెట్టి, మోజోస్, సరోజ, సతీష్ రాథోడ్, విద్యార్థులు పాల్గొన్నారు.



గణిత ప్రదర్శనలను నిర్వహించిన విద్యార్థులు

**దేవరకద్ర, డిసెంబరు 21 ప్రభాతవార్త :** గణిత పితామహుడు , గణిత శాస్త్ర రంగంలో తనకంటూ విశిష్టమైన స్థానాన్ని సాధించుకున్న మేధావి శ్రీనివాసా రామానుజన్ 137 వ జయంతి వేడుకలు శనివారం దేవరకద్ర మండలం



1729 ఆకారంలో విద్యార్థినీ, విద్యార్థులు

లక్ష్మిపల్లి లో ఘనంగా నిర్వహించారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఆవరణలో ఏర్పాటు చేసిన గణిత శాస్త్ర వేత్త శ్రీనివాసన్ రామానుజన్ చిత్ర పటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చతుర్విధ ప్రక్రియలకు సంబంధించిన కూడిక(ప్లస్),తీసివేత( మైనస్), గుణకారం (మల్టిఫికేషన్), బాగాహారం (డివిజన్)ల ఆకారంలో విద్యార్థులు కూర్చొని అందరినీ ఆకట్టుకున్నారు. ఉన్నత పాఠశాలకు చెందిన గణితం స్కూల్ అసిస్టెంట్ కోటకద్ర మురళీధర్‌ను శాలువ, పూల మాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయుడు అశ్విని చంద్రశేఖర్ మాట్లాడుతూ గణిత శాస్త్ర వేత్త శ్రీనివాసన్ రామానుజన్ జీవితచరిత్ర, గొప్పతనంగురించి విద్యార్థులకు వివరించారు. కేంబ్రిడ్జి యూనివర్సిటీ నుంచి బ్యాచలర్ ఆఫ్ సైన్స్ బై రీసెర్చి అవార్డును అందుకున్న గొప్ప వ్యక్తి భారతీయ గణిత శాస్త్రవేత్త శ్రీనివాసరామానుజన్ అయ్యం గార్ అని కొనియదారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్ ఎం కె.కె శ్రీనివాస్, ఉపాధ్యాయులు నాగేశ్వర్‌రెడ్డి, మదన్‌మోహన్, చంద్రశేఖర్, విజయలక్ష్మి, సుజాత, పాఠశాల, విద్యార్థులు పాల్గొన్నారు.

**చిన్నచింతకుంట,డిసెంబరు 21 ప్రభాతవార్త:** గణిత పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని శనివారం మండలంలోని ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలలలో జాతీయ గణిత దినోత్సవాన్ని నిర్వహించారు.ఆయా జడ్పీ పాఠశాలలో గణితమేల లో భాగంగా విద్యార్థులచే గణిత ప్రదర్శనలను నిర్వహించారు.మండలంలోని లాల్ కోట జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు చేసిన గణిత ప్రదర్శనలను ఎంతగానో ఆకట్టుకున్నాయి.విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఈ ప్రదర్శనలు ఎంతో దోహదపడతాయని మండల విద్యాధికారి జిహెచ్ఎం మురళీకృష్ణ తెలిపారు.విద్యార్థులు వ్యాసరచన, డ్రాయింగ్, ఉపన్యాస పోటీలను నిర్వహించడం జరిగిందన్నారు.విద్యార్థులు క్లైనోమీటర్



గణిత దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

,భాగహార యంత్రం, కోణాలలో రకాలు వర్కింగ్ మోడల్, పూరక మరియు సంపూర్వక రకాల వర్కింగ్ మోడల్, బార్ రేఖ వర్కింగ్ మోడల్, జ్యామితీయ ఆకారాలు, గోడ గడియారం వర్కింగ్ మోడల్,క. సా.గు వర్కింగ్ మోడల్ గణిత ప్రదర్శనలను నిర్వహించారు.ఈ పోటీలలోగెలుపొందిన ప్రథమ,ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు బహుమతులను అందజే యడం జరిగిందని ఎంఈఓ తెలిపారు.పోటీలో పాల్గొన్న విద్యార్థులకు కన్సల్టెం ట్ బహుమతులను అందించామనిఆయన తెలిపారు.విజయవంతంగాగణిత ప్రదర్శనలను నిర్వహించిన గణితఉపాధ్యాయులను సన్మానించారు.ఈకార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గంగయ్య, సామన, జయలక్ష్మి తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

**గోపాల్ పేట డిసెంబరు 21ప్రభాతవార్త:** గణితశాస్త్ర రంగంలో తనకంటూ విశిష్టమైన స్థానాన్ని సాధించుకున్న మేధావి శ్రీనివాస రామానుజన్ 137 వ జయంతి సందర్భంగా శనివారం మండల పరిధిలోని ఏదుట్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ గౌడ్ తొలుత రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంబ్రిడ్జి యూనివర్సిటీ నుంచి బ్యాచలర్ ఆఫ్ సైన్స్ బై రీసెర్చి అవార్డును అందుకున్న గొప్ప వ్యక్తి భారతీయ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ అయ్యంగార్ అని కొనియదారు. పాఠశాలలో విద్యార్థులు ఏర్పాటు చేసిన గణిత శాస్త్రటిఎల్ ఎం ప్రదర్శన, క్విజ్ పోటీలు పలువురిని ఆకట్టుకున్నాయి. పాఠశాల గణిత ఉపాధ్యాయులు నాగరాజు, రాధా,లు విద్యార్థులకు గణిత శాస్త్రం గురించి విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మధుసూదన్ రావు, నరేంద్రచారి, శ్రీనివాసులు, దామోదర్‌రెడ్డి, దర్శన్ కుమార్, రాజవర్ధన్,రవి, కృష్ణయ్య,లతీఫ్, పాల్గొన్నారు.



ప్రిన్సిపాల్ రామిరెడ్డిని సన్మానిస్తున్న విద్యార్థులు

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు జడ్చర్ల విద్యార్థినులు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

**జడ్చర్ల, డిసెంబ'రు 21 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ స్టేడియం గ్రౌండ్‌లో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీలో అండర్ 16 విభాగంలో రెండు కిలోమీటర్లలో వి నిఖిత, 4 కి.మీ. విభాగంలో మహిన్ జోహా మొదటి స్థానంలో, ఉజమా తైసీన్ రెండవ స్థానంలో నిలిచారు. తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పోటీలలో ఆదివారం నాగర్కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణం లో నిర్వహించే పోటీల్లో పాల్గొనబోతున్నారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థినులను పాఠశాల ప్రిన్సిపాల్, పిఈటీ, అధ్యాపకులు, తల్లిదండ్రులు అభినందించారు.

## న్యూ రిషి పాఠశాలలో అంధుల కచేరి



అందుల కచేరి నిర్వహిస్తున్న దృశ్యం

**మహబూబ్‌నగర్, డిసెంబరు21 ప్రభాతవార్త:** మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలోని న్యూ రిషి పాఠశాలలో స్వర వేదిక సొసైటీ హైదరాబాద్ వారిచే అందుల కచేరి నిర్వహించారు. కళ్ళున్న చీకటిలోనే ఉన్నామని, మీ కళ్ళల్లోనే మా వెలుతురు చూస్తున్నామని, భక్తి దేశభక్తి ఈతరం పాటలు ఆలపించి అందరినీ అలరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ వెంకటరమణ,చైర్మన్ చంద్రకళ వెంకటయ్య,డైరెక్టర్లు పూజిత మోహన్‌రెడ్డి, శిరీష ప్రవీణ్‌కుమార్ సాయి శశాంక్ పాల్గొన్నారు.

## మర్రి జంగిరెడ్డికి ఘన నివాళి



మర్రి జంగి రెడ్డికి నివాళులర్పిస్తున్న టిఆర్ఎస్ నాయకులు

**బిజినేపల్లి, డిసెంబరు 21 ప్రభాతవార్త:** మాజీ శాసనసభ్యులు మర్రి జనార్దన్ రెడ్డి తండ్రి మర్రి జంగిరెడ్డి అనారోగ్యంతో మృతి చెందడంతో మండల టిఆర్ఎస్ నాయకులు ఘన నివాళులర్పించారు. నేరేళ్లపల్లి గ్రామంలో మర్రి జంగిరెడ్డి పార్థివదేహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళి అర్పించిన వారిలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గంగన మోని కిరణ్, పిఎసిఎస్ చైర్మన్ బాలరాజ్ గౌడ్, అనిల్, రాములు, శ్రీశైలం ,నరేందర్ గౌడ్, రాగే రమేష్, మధు, పృధ్వీరాజ్, కిషోర్ ఉన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం



ధ్యానం చేస్తున్న పాఠశాల విద్యార్థులు

**ఆత్మకూరు డిసెంబరు21 ప్రభాతవవార్త:** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో శనివారం రోజు పలు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో అంతర్జాతీయ ధ్యాన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఆత్మకూరులోని ఆత్మసాయి పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో ప్రతి పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు ధ్యాన సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించారు. ఆత్మసాయి పిరమిడ్ కేంద్రం నిర్వాకులు అపర్ణ విద్యార్థిని విద్యార్థులకు పలు సూచనలు చేస్తూ ధ్యానం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందగలుగుతామని సూచించారు. పట్టణంలోని ఎన్విరామన్ పాఠశాల, శ్రీవాణి పాఠశాల తో పాటుగా పలు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో ధ్యాన సమావేశాలు నిర్వహించి విద్యార్థినీ విద్యార్థుల చేత ధ్యానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు మాజీ ఎంపీపీ మొగిలి,శ్రీధర్‌గౌడ్,టీజే విశ్వేశ్వర్,ఆత్మసాయి పిరమిడ్ ధ్యాన మందిరం సభ్యులు లావణ్య,ప్రమీల,తదితరులతో పాటుగా పలువురు ధ్యాన సమావేశంలో పాల్గొన్నారు.



**కొత్తకోట డిసెంబరు21 ప్రభాతవార్త:** కొత్తకోట ఆరోగ్య వాకింగ్ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ ధ్యాన దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ధ్యాన శిక్షకులు రమేష్ రాజ ధ్యానం చేయు పద్ధతులు, ధ్యానం చేయడం వల్ల లాభాలు మొదలయిన విషయాలు వివరించారు. యోగ,ధ్యానం చేయడం వల్ల సర్వరోగాలు నివారించబడి ఆరోగ్య సమాజం ఏర్పడుతుందని ఫలితముగా ప్రపంచం అనారోగ్య సమస్యలను చాలా వరకు మందులు లేకుండా తగ్గించుకొని ప్రజలు సుఖశాంతులతో మెలగవచ్చని తెలిపారు. యోగ , ధ్యానం, ఆసనాలను ప్రపంచానికి అందించిన భారత దేశం కీర్తి చాలా గొప్పదని కొనియాడారు. ప్రతి మనిషి తన బిజీ జీవితములో తన శరీరం కోసంకొంత సమయాన్ని కేటాయించుకొని ఆరోగ్యవంతులుకావొచ్చునని తెలిపారు.అనంతరం సభ్యులచె సంగీత ధ్యానం చేయించి అబ్బురపరిచారు. ఈ కార్యక్రమం లో ఆరోగ్యవాకింగ్ క్లబ్‌ఫౌండర్ శేఖర్ గౌడ్ సభ్యులు పాల్గొన్నారు.

**భూత్పూర్, డిసెంబరు 21, ప్రభాతవార్త:** అంతర్జాతీయ ధ్యాన దినోత్సవాన్ని పురస్కరించుకుని భూత్పూర్ మండలం కప్పెట గ్రామం లోని యుపీఎస్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థులు , భూత్పూర్ పీహెచ్‌సీ ఆరోగ్యశాఖ ఉద్యోగులు,సిబ్బంధి ధ్యానం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆరోగ్య సహాయకుడు శ్రీనివాస్ ధ్యానంలో పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ధ్యానం వల్ల విద్యార్థుల్లో మానసిక వికాసం కల్గుతుందన్నారు.చదువుతో పాటు యోగ,ధ్యానంతో జ్ఞాపకశక్తి,మానసిక పరిపక్వత వస్తుందన్నా రు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కడప వెంకట నారాయణతో పాటు ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆరోగ్య సహాయకురాలు అరుణాదేవి,ఆశ కార్యకర్తలు గౌసియా,వహీదా తదితరులు పాల్గొన్నారు.

## నేడు మిషన్ భగీరథ తాగునీరు నిలిపివేత

**నారాయణపేట టౌన్, డిసెంబరు 21 ప్రభాతవార్త :** నేడు సాయంత్రం 6 గం.ల నుండి రేపు 6:00గంటల వరకు 24 గంటలు నీటి సరఫరా నిలిపి వేయడం జరుగుతుందని పుట్ట వెంకటరెడ్డి కార్యనిర్వాహక అభియాంత మిషన్ భగీరథ లీడ్ డివిజన్ మహబూబ్‌నగర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరికల్ నుండి నారాయణపేట పోయే దారిలో కొత్తతండా దగ్గర మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ అవుతున్నదునా లీకేజీ అవుతున్న పైపులు తీసి కొత్త పైపులు అమర్చటానికి నీటి సరపరా నిలిపివేయడం జరుగుతుంది. ఈ పని పూర్తి కావడానికి సుమారు 24 గంటలు నీటి సరఫరా ఆపివేయడం జరుగుతుంది. దీనివలన మన్యంకొండ నీటి శుద్ధి కేంద్రం నుండి నీటి సరపరా అయ్యే దేవరకద్ర, నారాయణపేట, మక్తల్ అసెంబ్లీ నియోజకర్వార్గాలలోని దేవరకద్ర, నర్వ, మరికల్, ఊట్కూర్, నారాయణపేట, దామరగిద్ద మండలాలు పూర్తిగా కౌకుంట్ల, చిన్నచింతకుంట, మక్తల్, ధన్వాడ మండలాలు పాక్షికంగా, మక్తల్, నారాయణపేట మున్సిపాలిటీలు పూర్తిగా మొత్తం 245 గ్రామాలు, 2 మున్సిపాలిటీలు నీటి సరఫరా ఉండదు. కావున ప్రజలందరూ సహకరించగలరన్నారు.

## ఘనంగా గణిత దినోత్సవ వేడుకలు

**చిన్నంబావి, డిసెంబరు 21 ప్రభాతవార్త:** మండల పరిధిలోని వెలగొండ గ్రామంలో భారతీయ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జన్మదినాన్ని పురస్కరించుకొని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గణిత దినోత్సవం ఆదివారం కావడంతో శనివారమే ఈ వేడుకలను నిర్వహించడం గమనార్హం. ఈ సందర్భంగా విద్యార్థులు తయారుచేసిన వివిధ గణిత బోధనోపకరణాలతో మేళా నిర్వహించారు. అదేవిధంగా గణితంలో వివిధ అంశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేసి ప్రపంచంలో గణితం యొక్క ప్రాముఖ్యత మరియు ఉపయోగాలను వివరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ భారతదేశానికి గణితంలో సుదీర్ఘమైన ప్రస్థానం ఉందని, మనం దీన్ని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. రామానుజన్ గణితంలో చేసిన కృషి గురించి నేటి తరానికి అవగాహన కల్పించడమే కాకుండా మనదేశంలో గణితశాస్త్ర అధ్యయనానికి అదనపు ప్రోత్సాహకాలను అందించాలని సూచించారు.12 సంవత్సరాల వయసులోనే గణితంలో రామానుజన్ మంచి గుర్తింపు పొందారని, ఆయన గణిత పరిశోధనలు చూసి ఇతర గణిత శాస్త్రవేత్తలు ఆశ్చర్యపోయేవారనీ తెలిపారు. ఆయన తన 32వ ఏట మరణించినా, బతికింది తక్కువ కాలమే అయినా గణిత శాస్త్రంలో ఇన్ఫినిటీ సిరీస్, నంబర్ థియరీ, కంటిన్యూడ్ ఫ్రాక్షన్స్, గేమ్ థియరీ వంటి ఎన్నో కొత్త ఫార్ములాలను అందించారన్నారు. అనంతరం పాఠశాల గణిత ఉపాధ్యాయిని శ్రీదేవిని ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయ బృందం శాలువాతో సన్మానించారు. అదేవిధంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశంతో పాటు ధ్యాన దినోత్సవం కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడుతో పాటు ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల ఉపకరణాలకు దరఖాస్తు చేసుకోండి

**కొల్లాపూర్, డిసెంబరు 21 ప్రభాతవార్త :** కొల్లాపూర్ నియోజక వర్గ పరిధిలో చెయ్యి లేని నిరుపేద దివ్యాంగులకు రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్ శాఖ ఆధ్వర్యంలో జనవరి నెలలో హైదరాబాదులో బ్యాటరీతో పని చేసే ప్రోస్టటిక్ హ్యాండ్ ను ఉచితంగా పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొల్లాపూర్ నియోజకవర్గంలో ఉన్న దివ్యాంగులు మోచేతి కింద మణికట్టు పైన చేతితో అర్హులైన వారు కొల్లాపూర్ పట్టణంలో మంత్రి జూపల్లి క్యాంప్ కార్యాలయం ఆవరణలో ఉన్న రత్నగిరి ఫౌండేషన్ కార్యాలయంలో నేరుగా వచ్చి ఈనెల 23,24 వ తేదీలలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కొల్లాపూర్ నియోజక వర్గ పరిధిలో ఉన్నటువంటి దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పెర్కొన్నారు. వివరాలకు 9177050558 ను సంప్రదించాలని తెలిపారు.

## శనైశ్చరస్వామికి తిల తైలా అభిషేక పూజలు



శివాలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

**బిజినేపల్లి, డిసెంబర్ 21 ప్రభాతవార్త :** నంది వడ్డేమాన్ గ్రామంలో శనివారం శ్రీసార్థా సప్త జేష్టమాత సమేత శనేశ్వర స్వామికి ప్రత్యేకంగా తిల తైల అభిషేకాల పూజలు నిర్వహిం చారు. ఆలయ ప్రధాన అర్చకులు డా.గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేకంగా అష్టోత్తర నామాలతోతిల,తైల అభిషేక పూజల్లో పాల్గొన్నారు . ఈనెల 28న శని త్రయోదశి ఉన్నదని,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు ఈ మాసములో బ్రహ్మ సూత్రం గల పరమ శివునిదర్శనం చేయడం ఏంతో పుణ్యఫలి తమని అన్నారు.భక్తుల శనిగ్రహ జన్మరిత్యా గోచారరీత్యా ఉన్న గ్రహదోష పరిహారానికి, శాంతి కొరకుశనేశ్వర స్వామినీ నువ్వులనూనె,జిల్లేడుపూలు, జమ్మి,జిల్లేడు ఆకులతో ఈరోజు స్వామివారిని పూజించారని అన్నారు.అనంతరంగోనబుద్ధారెడ్డి కాలంనాటి బ్రహ్మసూత్రం గల పరమశివునికి ఈరోజుభక్తులచే సామూహిక రుద్రాభిషేకపూజలు,అర్చనలు ప్రత్యేకంగా నిర్వహించినట్లు ఆయన తెలిపారు. గణపతి, నందీశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు వేదఆశీర్వచనం తీర్థప్రసాదాల పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వెల్దండ గోపాల్‌రావు, ఆలయ కమిటీసభ్యులు, రాజేష్ ప్రభాకర్, పుల్లయ్య, ఆలయ ఆర్చకులు గవ్వమఠం శాంతికుమార్,ఉమమహేశ్వర్, సిబ్బందిగోపాల్‌రెడ్డి భక్తులు,మహిళలు,అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రతి కార్యకర్తకు జనసేన పార్టీ అండగా ఉంటుంది

◆ వనపర్తి కోఆర్డినేటర్ ముకుంద నాయుడు ◆ మృతుడి కుటుంబానికి 5 లక్షల ప్రమాద బీమా చెక్కు అందజేత



మృతుడి కుటుంబానికి ప్రమాద బీమా చెక్కును అందజేస్తున్న జనసేన పార్టీ నాయకులు

**వనపర్తి టౌన్ డిసెంబరు 21 ప్రభాతవార్త:** ఇటీవల ప్రమాదంలో మరణించిన వనపర్తి జిల్లా పెబ్బేర్ మండలం చెలిమిళ్లకు చెందిన కె. పవన్ కుమార్ కుటుంబ సభ్యులను జనసేన పార్టీ రాష్ట్ర ఇంచార్జ్ నేమూరి శంకర్ గౌడ్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు రాధారం రాజలింగం, వనపర్తి కోఆర్డినేటర్ ముకుంద నాయుడు పరామర్శించి బాధిత కుటుంబానికి ఐదు లక్షల రూపాయల భీమా చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ప్రతి జన సైనికుడి కుటుంబానికి పవన్ కళ్యాణ్ ఎల్లప్పుడూ అండగా ఉంటారని రాష్ట్ర నాయకులు అన్ని సందర్భాలలోనూ జన సైనికులకు తోడుగా నిలుస్తారని తెలిపారు. జన సైనికులు అందరూ సభ్యత్వం కలిగి ఉండాలని ఎదైనా ఇలా అనుకోని సంఘటనలు జరిగినప్పుడు వారి కుటుంబాలకు పార్టీ అందిస్తున్న ఈ ప్రమాద భీమా వారి కుటుంబ సభ్యులకు చేయుతగా ఉంటుందని కార్యకర్తల క్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఏ పార్టీలో లేని ప్రమాద భీమాను మెడికల్ ఇన్సూరెన్స్ జనసేన అధినేత అందిస్తున్నారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్, రాష్ట్ర వీర మహిళ విభాగం చైర్మన్ మండపాక కావ్య, నిహారిక నాయుడు, శిరిష, లిఖిత, వనపర్తి జిల్లా నాయకులు బాలకృష్ణ పాల్గొన్నారు.

## ప్రభుత్వాసుపత్రిలో సాధారణ ప్రసవాలు అయ్యే విధంగా చూడాలి

◆ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డా. స్వరాజ్యలక్ష్మి



లింగాల ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి

**లింగాల, డిసెంబరు 21 ప్రభాతవార్త:** ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలు అయ్యేలా చూడాలని, ఆసుపత్రులపై నమ్మకం కల్గించే విధంగా వైద్యాధికారులు పని చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డా.స్వరాజ్యలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని లింగాల,అంబట్ పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేసి, వాక్సినేషన్, ప్రసవాల రికార్డులు, ఆరోగ్య సేవల రికార్డులను పరిశీలించారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డా.స్వరాజ్య లక్ష్మి మాట్లాడారు. ఆసుపత్రిల్లో ప్రసవాల సంఖ్యును పెంచాలని వైద్యాధికారులకు సూచించారు.ప్రతి చిన్నారికి వాక్సినేషన్ తప్పని సరిగా అందించాలని కోరారు.ఆశ కార్యకర్తలు తమ పరిధిలోని వ్యాక్సిన్ డ్యూ లిస్ట్‌లో ఉన్న ప్రతి చిన్నారిని సెంటర్ తీసుకొచ్చి వాక్సిన్ వేయించాలని సూచించారు. గర్భిణీ ప్రసవ ప్రణాళికను రూపొందించాలని సూచించారు.వ్యాక్సిన్ వేయించిన చిన్నారుల వివరాలను ఎప్పటికప్పుడు యూ విన్ ఆన్లైన్ పోర్టల్ లో తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించి సరైన వైద్యం అందించాలని కోరారు. వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా.రవి కుమార్ నాయక్, డిప్యూటీ డిఎమ్ హెచ్ఓ డా. తారసింగ్, అంబటి పల్లి,లింగాల వైద్య అధికారులు,డివిఎల్, ఏపిఓ రాజేష్, పర్యవేక్షణా అధికారులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

**మక్తల్, డిసెంబరు21 ప్రభాతవార్త:** ఇటీవల మక్తల్ పట్టణంలో నిర్వహించిన సీఎం కప్ జిల్లా స్థాయి స్పీడ్ సైక్లింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిఉన్నవారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు డివైఎస్ఓ వెంకటేష్‌శెట్టి, సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.గోపాలం తెలిపారు.ఈ మేరకు రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారు లను శనివారం ట్రైని కలెక్టర్ గరీమ నరుల్లా ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీల కు ఎంపికైన బాలికలు:శ్రావణి ,సాక్షిత,నందిని ,మల్లీశ్వరి ,లాస్య, గాయత్రి ,మేఘన ,దీప్తి,మాధురి, నిహారిక, జెస్సికా, చందన. బాలురు:వినయ్ కుమార్, దర్శన్, రోహిత్, భరత్ కుమార్, హరికృష్ణ, బాబు, పరశురాములు, మమ్మద్ పరహన్,అనిల్, వినయ్, అరవింద్, రమేష్. రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 27 నుండి 30 వరకు రంగారెడ్డిజిల్లా మహేశ్వరంలో జరుగు రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ భోగేశ్వర్లు, గురుకులప్రిన్సిపల్ చంద్రకళ,పీడీలు విష్ణువర్ధన్, ఈశ్వర్, విద్యాసాగర్, రాకేష్, రమేష్ కుమార్, మీనా కుమారి, సౌమ్య, అమ్రేష్, దామోదర్, దీప, నరేష్, వెంకట్ రాములు క్రీడాకారులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు మాగనూరు విద్యార్థులు ఎంపిక

**మాగనూరు, డిసెంబరు 21 ప్రభాతవార్త:** జిల్లా స్థాయి సీఎం కప్ సైక్లింగ్ పోటీలు ఈనెల 20న మక్తల్‌లో జరిగాయి. దాదాపు 300 మంది క్రీడాకారులతో పోటీపడి పాఠశాల విద్యార్థులు పి. శ్రావణి 5 కిలోమీటర్ల సైకిల్ రేసులో మొదటి స్థానం, దర్శన్ 9వ తరగతి జిల్లా రెండవ స్థానంలో గెలుపొంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిద్దరూ హైదరాబాదులో ఈ నెలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారు. వీరి ఎంపిక పట్ల విద్యార్థులను పాఠశాల పీడీ రాకేష్‌ను ప్రధానోపాధ్యాయులు మురళీధర్‌రెడ్డి, సైక్లింగ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. గోపాలం, వెంకట్ రాములు ఉపాధ్యాయుల బృందం, గ్రామ పెద్దలు, గ్రామస్తులు అభినందించడం జరిగింది.

## ప్రైవేటు ఆసుపత్రులపై పర్యవేక్షణ కరువు

◆ నిరుపేదలను దోచుకుతింటున్న పట్టించుకునే వారు లేరు

◆ ఓబీసీ మోర్చా నారాయణపేట జిల్లా నాయకులు బాలరాజు యాదవ్

**నారాయణపేట టౌన్, డిసెంబరు 21 ప్రభాతవార్త:** ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం కోసం వచ్చిన నిరుపేదలను డాక్టర్లు వైద్యంపేరుతో దోచుక తింటున్నారని ఓబీసీ మోర్చా నారాయణపేట జిల్లా నాయకులు బాలరాజు యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఓ ప్రకటనలో మాట్లాడుతూ అర్హత లేని డాక్టర్లు వైద్యం పేరుతో లక్షలు గడిస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రుల పైన జిల్లా వైద్యాధికారుల పర్యవేక్షణ కరువు కావడంతో నిరుపేదలపై డాక్టర్ల దోపిడీ మరింత పెరిగింది అన్నారు. అర్హత లేని డాక్టర్లు వైద్యం పేరుతో చిన్న పిల్లలు ప్రాణాలు తీస్తున్న వైద్య శాఖ అధికారులకు చీమ కుట్టినట్టు కూడా లేదన్నారు. అర్హత లేని డాక్టర్లు విచ్చలవిడిగా చెలామణి అవుతున్నారు. ఇటీవల నారాయణపేట జిల్లా కోస్గిలో వైద్యం వికటించి 9నెలల పసికందు మృతి చెందిందన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల పై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

## భక్తిశ్రద్ధలతో ధనుర్మాస ప్రత్యేక పూజలు

**బిజినేపల్లి, డిసెంబరు 21 ప్రభాతవార్త:** పాలెం శ్రీ అలర్మెల్ మంగ సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ధనుర్మాన ప్రత్యేక పూజలు 6వ రోజు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు రామానుజచార్యులు ప్రతిరోజు తెల్లవారుజామున 5 గంటలకు స్వామి వారికి సుప్రభాత సేవ,తిరుప్పావై సేవా కాలం, గోదా అమ్మవారికి ప్రత్యేకంగా కుంకుమార్చన పుష్పార్చన,మహా మంగళ హారతి వేదమంత్రోచరణలో మధ్య నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు పాశుర విశిష్టతను తెలుపుతూ భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు .ఈ కార్యక్రమంలో అర్చకులు జయంత్ శుక్ల చక్రపాణి అరవిందు ఆలయ సిబ్బంది బాబయ్య, వెంకటేష్, జగదీష్ భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పోషకాహారం ఆరోగ్యానికి బలం: ఎంఈఓ



పోషకాహారం గురించి వివరిస్తున్న దృశ్యం

**రాజాపూర్, డిసెంబరు 21 ప్రభాతవార్త:** పోషకాహారం ఆరోగ్యానికి బలంగా ఎంతో మేలు చేస్తుందని విద్యార్థుల ఎదుగుదలకు ఎంతో దోహద పడుతుందని ఎంఈఓ సుధాకర్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని ప్రైమరీ స్కూల్ వాచ్యతండాలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమై విద్యార్థులు ఎదుగుదలకు ఆరోగ్యంగా ఉండడానికి పౌష్టిక ఆహారం ఎంతో మేలుచేస్తుందని పౌష్టిక ఆహారం స్నాక్స్ ఎలా తయారు చేయాలో వివిధ రకాల సూచనలు సలహాలు ఇస్తూ పౌష్టికాహార తయారు చేసే పద్ధతులను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా మనబడిలో తెలంగాణ ఆహారోత్సవం



తెలంగాణ ఆహారోత్సవంలో పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులు

**బిజినేపల్లి, డిసెంబరు21 ప్రభాతవార్త:** కారుకొండ ప్రాథమికోన్నత పాఠశాల లో శనివారం తెలంగాణ ప్రభుత్వం ఆదేశంతో "మన బడిలో ఆహారోత్సవం" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఇంటి వద్ద విద్యార్థులకు రోజు వండే పౌష్టికాహారాన్ని వండుకొని వచ్చి పాఠశాలలో అందరిలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కూడా వివిధ రకాల వంటలను వండుకు వచ్చి పేరెంట్స్ మీటింగ్ లో ప్రదర్శించారు. శ్రీ శ్రీనివాస రామానుజన్ పుట్టినరోజు సందర్భంగా ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అందరికీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పేరెంట్స్‌కి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు రామకృష్ణ ఉపాధ్యాయులు రామకృష్ణ, ఇంద్రాణి, శ్రీకాంత్, భాగ్యలక్ష్మి, లావణ్య, భారతి, మేఘన, తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

## సమతుల్య ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం

● వనపర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అక్కి శ్రీనివాస్‌గౌడ్



**పెబ్బేరు డిసెంబరు 21 ప్రభాత వార్త:** పెబ్బేరు పట్టణంలో చెంచు వాడ పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వనపర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అక్కి శ్రీనివాస్ గౌడ్ పెబ్బేరు మండలం విద్యాధికారి యస్ జయ రాములు ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని పరిశీలించి వారు మాట్లాడుతూ విద్యార్థులకు సమతుల్య ఆహారాన్ని అందించాలని ప్రతినిత్యం విద్యార్థులు పౌష్టికాహారాన్ని భుజించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెడ్మాస్టర్ ఏ విష్ణువర్ధన్ రావు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్పర్సన్ పార్వతి శివ సాయి, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు డిచిన్న రాములు, స్థానిక వార్డు కౌన్సిలర్ఎలస్వామి, పెబ్బేరు పట్టణనాయకులు తోకల సత్యనారాయణ, గంధం రాజశేఖర్, ఉపాధ్యాయులు మాధురి, అంగన్వాడి టీచర్ రాధమ్మ, ఆయా రాధ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలి

**ఆత్మకూరు డిసెంబరు21 ప్రభాత వార్త:** వనపర్తి పట్టణంలోని రేడి యంట్ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థి మృతికి కారణ మైన పాఠశాల యాజమాన్యం నుండి 20 లక్షల రూపాయల నష్టపరిహారం చెల్లించాలని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి కుతుబ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం రోజు ఆత్మకూరు పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేడియంట్ పాఠశాల యాజమాన్యం ప్రభుత్వ ఉపాధ్యాయునిగా కొనసాగుతూ ప్రైవేట్ పాఠశాలలను నడపడమే కాకుండా యాజమాన్యం నిర్లక్ష్యం మూలంగా మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి తగిన నష్టపరిహారం చెల్లించడమే కాకుండా పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు జిల్లా వ్యాపితంగా ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తూ పలు పట్టణాలలో ప్రైవేట్ పాఠశాలలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనకార్యక్రమాలను నిర్వహించినట్లుగా ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు మహేష్ యూనస్ తదితరులు పాల్గొన్నారు.

## ధ్యానం, యోగాతో మానసిక శారీరక ఆరోగ్యం



ధ్యానం చేస్తున్న దృశ్యం

**నారాయణపేట టౌన్, డిసెంబరు 21 ప్రభాతవార్త:** ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా నారా యణపేట జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో ఆర్ముడు రిజర్వ్ పోలీసులకు ధ్యానం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆర్ఎస్పై శివశంకర్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరి రక్షణలో భాగంగా నిత్యం బిజీ బిజీగా ఉండే అధికారులు, సిబ్బంది నిత్యం ధ్యానం, యోగా సాధనతో తమ ఆరోగ్యంపై పట్టు సాధించవచ్చు అన్నారు. ధ్యానం చేయడం వల్ల శారీరకంగా మానసికంగా ప్రశాంత లభిస్తుందని, ఆరోగ్యంగా ఉన్నప్పుడే విధులు సక్రమంగా నిర్వర్తించ గలమని తెలిపారు. కావున ధ్యానాన్ని యోగాన్ని దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆర్గనైజర్ గద్దె అంజనేయులు మాట్లాడుతూ మన మందరం కలిసికట్టుగా జీవితాలను మార్చుదాం అని ప్రతి ఒక్కరూ ప్రతి రోజు ధ్యానం, యోగ చేయాలని ధ్యానం చేయడం వల్ల కలిగే ఉపయోగాల గురించి, ధ్యానం ఏ విధంగా చేయాలి, ఎప్పుడు చేయాలి, నియ నిబంధనలు తదితర అంశాల గురించి అధికారులకు సిబ్బందికి అవగా హన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్మూడ్ రిజర్వు పోలీసులు, పతాంజలి యోగ సమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## బస్సుల్లోంచి డీజిల్ చోరీ చేసిన గుర్తుతెలియని దుండగులు

**ఖిల్లాఘణపురం డిసెంబరు 21ప్రభాతవార్త:** వనపర్తి డిపోకు చెందిన రెండు బస్సుల్లోంచి శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు డీజిల్ దొంగిలించిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు ఆర్టీసీ సిబ్బంది కథనం ప్రకారం వనపర్తి డిపోకు చెందిన టీఎస్ 32 జెడ్ 0020, టీఎస్ 32 జెడ్ 0024 నంబర్లు గల ఆర్టీసీ బస్సులు వనపర్తి పట్టణం నుండి ఒకటి మహబూబ్‌నగర్ పట్టణం నుండి మరో బస్సు నైట్ అల్ట్ ముగించుకుని మండల కేంద్రంలోని స్థానిక పెట్రోల్ బంకువద్ద రోజు మాదిరిగా ఆపిఉంచారు. డ్రైవర్లు కొత్త కాపు శ్రీనివాస్‌రెడ్డి, శాంతయ్య కండక్టర్లు సత్యం వెంకటేశులు, వారి బస్సుల్లోనే పడుకున్నారు తెల్లవారుజామున నాలుగు గంటలకు నిద్రలేచి ట్రైర్లను పరిశీలిస్తుండగా డీజిల్ ట్యాంకులు తెరిచి ఉండడంతో డీజిల్ పరిశీలించగా పూర్తిగా దొంగలించబడినదని 372 లీటర్లు అందాద 36,672 రూపాయల డీజిల్ గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారని ఆర్టీసీ డ్రైవర్ కావాలి శాంతయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ గౌడ్ తెలిపారు. గ్రామం నడిబొడ్డును డీజిల్ దొంగిలించడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం నడిబొడ్డులో ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్‌బంక్ మండల కేంద్రంనుండి మహబూబ్‌నగర్ వెళ్లే ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్నది ప్రతిరోజు నైట్ హాల్ట్ బస్సులు రెండు అక్కడ ఆర్టీసీ సిబ్బంది ఆపుతుంటారు. ఏకంగా దాదాపు రెండు బ్యారెల్లు డీజిల్ దొంగిలించడంతో ఈ దొంగతనం పోలీసులకు సవాల్‌గా మారింది రాత్రి వేళల్లో పోలీసులు పెట్రోలింగ్ చేయకపోవడం కూడా ఇదొక కారణంగా కనబడుతోంది. పెట్రోల్ బంక్ పోలీస్ స్టేషన్ ఘణపురం బస్టాండ్ కు మధ్యలో ఉండడం రాత్రి సమయాల్లో కూడా వాహనాలు తిరిగే ప్రధాన రహదారి పక్కనే ఈ చోరీ జరగడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా పోలీసులు స్పందించి రాత్రి సమయాలలో మండలంలోని అన్ని గ్రామాలలో పెట్రోలింగ్ నిర్వహించాలని కోరుతున్నారు.

## ఎమ్మెల్యే నిధులతో పాత సంత బజార్లో బోరు ప్రారంభం

**ధన్వాడ డిసెంబరు 21 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో పాత సంత బజార్ దగ్గర ఎమ్మెల్యే నిధులతో చిట్టెం మాధవరెడ్డి హామీ మేరకు బోరు వేసి మోటారు దించి ప్రారంభోత్సవం జరిగిందిఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చిట్టెం మాధవరెడ్డి గారు మరియు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

# జడ్చర్ల మున్సిపాలిటీలో చెత్త పన్ను

- ప్రతి నెలా ప్రతి ఇంటికి రూ.50 చెల్లించాల్సిందే
- సివిల్ పనులకు ప్రతివార్డుకు రూ. లక్ష
- 41 అంశాలపై ఆమోదం తెలిపిన పాలకవర్గం

**జడ్చర్ల, డిసెంబరు21 ప్రభాతవార్త:** జడ్చర్ల మున్సిపల్ కార్యవర్గం పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. శనివారం జడ్చర్ల మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత అధ్యక్షతన, మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిలర్ల సమక్షంలో నిర్వహించిన మున్సిపల్ పాలకవర్గ సమావేశంలో పలు తీర్మానాలను చేసింది. ఇందులో భాగంగా మున్సిపాలిటీ పరిధిలో చెత్త సేకరణకు రూ.50 వసూలు చేసేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ముందుగా మున్సిపాలిటీ పరిధిలోని మూడు వార్డుల్లో (13,24,26) పైలెట్ ప్రాజెక్టుగా కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. అయితే చెత్త సేకరణకు సంబంధించి ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు కౌన్సిల్ తీర్మాణం చేసింది. ఈ క్రమంలో ప్రజల లోపల అనుమానాలు వస్తున్నాయి. ప్రతి కుటుంబం రూ.50 చెల్లించుకోలేని వారి పరిస్థితి ఏంటి అని ప్రశ్నిస్తున్నారు. ప్రతినెల డబ్బులు వసూలు చేసిన చెత్త సేకరణపై చిత్తశుద్ధితో వ్యవహరించాలని



మాట్లాడుతున్న చైర్ పర్సన్ పుష్పలత

చెబుతున్నారు. చెత్త శుద్ధితో.. జడ్చర్ల మున్సిపల్ పాలకవర్గం శనివారం ఆమోదం తెలిపిన అంశాలపై పట్టణంలో వాడి వేడి చర్చ కొనసాగుతుంది. ముఖ్యంగా గతంలో ఎన్నడూ లేని విధంగా చెత్త సేకరణకు ప్రతి కుటుంబానికి రూ.50 వసూలు చేయాలనే తీర్మానాన్ని పలువురు వ్యతిరేకిస్తున్నారు. ముందస్తుగా పైలెట్ ప్రాజెక్టుగా మూడు వార్డులో కార్యక్రమాన్ని చేపట్టడంతో కార్యక్రమ నిర్వహణ, అమలులో ఎదురయ్యే సమస్యల మీద చిత్తశుద్ధితో వ్యవహరించిపకడ్బందీగా అమలు చేయాలని కోరుతున్నారు. ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తూ తీర్మానం చేయడంతో ఏ మేరకు కార్యక్రమాన్ని అమలు పరుస్తారో తెలియాల్సి ఉంది. అయితే ప్రతి ఒక్కకుటుంబం నెలకు రూ.50 చెల్లించలేని పరిస్థితిలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

## సమగ్ర శిక్ష ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలి

■ బీజేపీ నేత నాగురావు నామాజీ

**నారాయణపేట టౌన్, డిసెంబరు 21 ప్రభాతవార్త :** సమగ్ర శిక్ష ఉద్యోగుల రెగ్యులరైజ్ కోసం నారాయణపేట జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్క్ వద్ద చేస్తున్న సమ్మె నీటితో పదవ రోజుకు చేరుకుంది. సమగ్ర శిక్ష ఉద్యోగుల శిబిరాన్ని నేడు బిజెపి రాష్ట్ర నాయకులు నాగురావు నామాజి, బీజేపీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి రఘురామయ్యగౌడ్, రఘువీర్ యాదవ్, వెంకట్రాములు, కెంచి శ్రీనివాసులు, టీడీపీ నేత ఓంప్రకాష్లు వారికి సంఘీభావాన్ని తెలిపారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర నేత నాగురావు నామాజీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసే విధానంలో రాష్ట్ర ప్రభుత్వాలకి పూర్తి స్వేచ్ఛనిచ్చాయని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని అంతవరకు వారికి పేస్కేల్ అమలు చేయాలని, ఈ కస్తూర్బా పాఠశాలలో బడుగు బలహీన వర్గాల పిల్లలు అనాధ పిల్లలు చదువుకుంటారని ఉద్యోగుల ఉద్యమంతో విద్యార్థినిలు గత కొన్ని రోజులుగా చదువుకు దూరం అయ్యారని, ఆ పిల్లలకు చదువు అందే విధంగా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. సమ్మెలో ఉన్న సమగ్ర శిక్ష ఉద్యోగులను



మాట్లాడుతున్న బిజెపి నేత నాగూరావు నామాజీ

రెగ్యులరైజ్ చేసే విషయంలో తొందరగా ఒక నిర్ణయం తీసుకోవాలని కోరారు. బీజేపీనారాయణపేట జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు చాలీచాలని జీతాలతో విధులు నిర్వహిస్తున్నారని వారు శ్రమ దోపిడీకి గురవుతున్నారని కావున ప్రభుత్వం వారి యొక్క డిమాండ్లను సమీక్షించి వారిని రెగ్యులరైజ్ చేయాలని కోరారు. ఇన్ని రోజులుగా వాళ్ళు సమ్మె చేస్తున్న పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని ఆయన అన్నారు. పదవ రోజు సమ్మెలో ఉన్న ఉద్యోగులకు అయ్యవారిపల్లి మాజీ సర్పంచ్ రాఘవేందర్ రెడ్డి మధ్యాహ్న భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు పెద్దమొత్తంలో పాల్గొన్నారు.

## యజమాన్యం నిర్లక్ష్యంతో విద్యార్థి మృతి..!



ధర్నా చేపట్టడంతో రోడ్డుపై నిలిచిన వాహనాలు

మొదటి పేజీ తరువాయి భాగం..

సమాచారం అందించడంతో అప్పటికే విద్యార్థి మృతి చెందాడు. మృతి చెందిన విద్యార్థి కుటుంబ సభ్యులు బిడ్డను చూసి కన్నీరు మునిరయ్యారు. ఈ సంఘటన జరగడంతో విద్యార్థులను పాఠశాలలో ఉంచి. ఉపాధ్యాయులు పాఠశాలకు తాళాలు వేసి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘం నాయకులు, ఆయా పార్టీ నాయకులు పాఠశాలకు చేరుకుని పరిస్థితులను పరిశీలించి రోడ్డుపైనే ధర్నా చేపట్టారు. విద్యార్థి మృతికి కారణమైన పాఠశాల యజమానిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘం నాయకులు పాఠశాలను ముట్టడించారు. పోలీసులు ఆందోళనలు చేపట్టకుండా అడ్డుకున్నారు. అనంతర విద్యార్థి సంఘంనాయకులు పాఠశాల గేటును దాటుకొని పాఠశాల భవనం పైకి దూసుకెళ్లారు. అనంతరంరోడ్డుపై బైఠాయించిరాస్తారోకో నిర్వహించి మృతి చెందిన కుటుంబానికి న్యాయం జరిగేంతవరకు ధర్నా విరమించమని మాట్లాడారు. స్పందించిన డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ కృష్ణ విద్యార్థి సంఘం నాయకులతో మాట్లాడి నచ్చజెప్పి ప్రయత్నం చేశారు. కేసునమోదుచేసిదర్యాప్తు చేపడతామనివారు వెల్లడించారు.

## బాయిల్డ్ రైస్‌మిల్‌ను సందర్శించిన ఆర్‌డిఓ



ఉప్పరి పల్లిలో బాయిల్డ్ రైస్ మిల్లులో పరిశీలిస్తున్న ఆర్డీఓ

**ఉప్పునుంతల, డిసెంబర్21 ప్రభాతవార్త:** మండలంలోని ఉప్పరి పల్లి గ్రామంలో ఉన్న బిఎంఆర్ బాయిల్డ్ రైస్ మిల్లును శనివారం అచ్చంపేట రెవెన్యూ డివిజన్ అధికారిణి మాధవి సందర్శించారు. వానాకాలంలో రైతులు పండించిన వరి ధాన్యాన్ని బాయిల్డ్ రైస్‌మిల్లు విక్రయించడంతో వెను వెంటనే బాయిల్డ్ బియ్యాన్ని ఎఫ్‌సిఐకి సకాలంలో అందజేయాలని నెల్లూరు యజమానికి సూచించారు. సందర్శించిన వారిలో ఆర్డీఓతో పాటు ఉప తహసీల్దార్ కేశవ్, మిల్లుయాజమాని అనంతఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



**నారాయణపేట టౌన్, డిసెంబరు 21 ప్రభాతవార్త:** దివ్య జననీ శారదా మాత 172వ జయంతి ఉత్సవాల సందర్భంగా దామరగిద్ద మండలం మద్దెలబీడు గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ఆదివారం నిర్వహించే జయంతి ఉత్సవాల్లో విద్యార్థులకు అందజేయనున్నట్లు సేవా సమితి నిర్వాహకులు తెలియజేశారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం తెల్లవారు జామున 5 గం.లకు నగర సంకీర్త, సుప్రభాత సేవా, సాయంత్రం ఆరాత్రికంతో బాటు భక్తులకు ప్రసాదం వితరణ రాత్రి ప్రత్యేక భజనలు, అనంతరం భజన మండలి సభ్యులకుసత్కారం చేపట్టినట్లుతెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం శంకర్, ఉపాధ్యాయులు శశిధర్, సేవా సమితి సభ్యులు నర్సింలు, వెంకట్రాములు, గోపాల్, జె. గోపాల్, మోహన్, కుర్వ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## మందకొడిగా కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వే

**ధన్వాడ, డిసెంబరు 21 ప్రభాతవార్త :** ధన్వాడతో పాటుగా మండలంలోని వివిధ గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తులు చేసుకున్న వారి ఇండ్లకు వెళ్లి అధికారులు సర్వేను నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగ సర్వే మందకొడిగా నడుస్తుండటంతో ఇండ్ల కోసం దరఖాస్తులు చేసుకున్న వారు ఆందోళన చెందుతున్నారు. ఇందిరమ్మ ఇండ్లకు సర్వేకు అధికారులు వస్తున్నారని తెలిసి చాలమంది తమ పనులు వదులుకొని ఇండ్ల వద్దే ఉంటున్నారు. తాము పనికి వెళ్లిన తర్వాత అధికారులు వస్తే మాకు ఎక్కడ ఇందిరమ్మ ఇళ్లు రాదోనని భయపడి కొంత మంది పనులు వదిలేసి ఇండ్ల వద్ద ఉంటున్నారు. కాని అధికారులు మాత్రం సర్వేను స్పీడ్ చేయడం. లేదని పలువురు వాపోతున్నారు. త్వర త్వరగా సర్వేను నిర్వహించాలని పలుపురు కోరుతున్నారు.

## విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కోసం ఆర్థిక సహాయం

ప్రధానోపాధ్యాయునికి చెక్కు అందిస్తున్న పౌండేషన్ నిర్వహకులు



ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

**ధన్వాడ, డిసెంబరు 21 ప్రభాతవార్త:** ధన్వాడ బాలుర ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు తాగునీటి సౌకర్యం ఇబ్బందిగా ఏర్పడింది. ఇది గుర్తించిన భద్రాది రామయ్య పౌండేషన్ సభ్యులు పేరపల్ల వాస్తవ్యులు పిల్లి కండ్ల జయశ్రీ వెంకట్రాములు దంపతులు పాఠశాలకు రూ.75 వేల ఆర్థిక సహాయం అందించారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ప్రధానోపాధ్యాయులు నరసింహ్మాచారికి చెక్కును అందించారు. పాఠశాలలో గత కొన్ని నెలల నుంచి విద్యార్థులు నీటి ఎద్దడితో ఇబ్బంది పడుతుండటంతో గుర్తించి ఆర్థిక సహాయం అందించారు. గతంలోను ఈ పౌండేషన్ సభ్యులు జయశ్రీ వెంకట్రాములు గతంలోను ధన్వాడ సంత బజార్ పాఠశాలకు పాఠశాలలో మౌలిక వసతుల కల్పన కోసం ఆర్థిక సహాయం అందించారు. ఈసందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం ఫౌండేషన్ సభ్యులను శాలువాతో సనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, ఉపాధ్యాయులు స్వప్న సురేష్ బాబు, శ్రీనివాస్, అశోక్ సాగర్, సునీత, సౌభాగ్యలక్ష్మితో పాటుగా పలువురు పాల్గొన్నారు.

## దాతలకు ఘన సన్మానం

**పాన్‌గల్ డిసెంబరు 21 ప్రభాతవార్త:** పానగల్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల సుందరీకరణకు అదే గ్రామానికి చెందిన కర్కాల రమేష్ రెడ్డి ,మంగ దొడ్డి రాము యాదవ్, కొత్త బలవర్ధన్ రెడ్డి ,ఉపాధ్యాయులు కొంకల నారాయణ, బాలరాజ్‌గౌడ్, ఆర్టిస్టు హక్కు పాషలను సన్మానించారు. హెచ్ఎం పద్మ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీనివాసులు తోపాటు పాఠశాల ఉపాధ్యాయ బృందం దాతలకు మేమెంటోలు శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దాతృత్వ గుణాన్ని చాటుకోవాలని అదే పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ఉన్నత స్థానాలకు చేరుకుని తాము చదివిన పాఠశాలకు ఏదైనా చేయాలని తపన తోపాటు దాతృత్వాన్ని కలిగి ఉండాలని కాంక్షించారు.



## కళ్ళకు గంతలతో గణిత అవధానం



గణిత అవధాని అనంతప్పను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

**పెబ్బేరు డిసెంబరు 21 ప్రభాతవార్త:** పెబ్బేర్ పట్టణంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం రోజు శ్రీనివాస రామానుజన్ జయంతి, అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. హార్ట్ఫుల్నెస్ ట్రైనర్స్ ఆధ్వర్యంలో రిలాక్సేషన్ ప్రక్రియ, గణిత అవధాన ప్రక్రియలో భాగంగా రాష్ట్రపతి అవార్డు గ్రహీత డాక్టర్ అనంతప్పచే గణిత అవధానం 100 సంఖ్యల పేర్లు కళ్ళ గంతలు కటుకొని చెప్పడంజరిగింది. మాయా కూడిక, మాయా చదరం, తేదీ, వారం మొదలగు ప్రక్రియలు చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు ఎంతో ఆసక్తిగాతిలకించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయులు ఏ విష్ణువర్ధన్ రావు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## దాతృత్వం చాటుకున్న పోలీస్ కానిస్టేబుల్



దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

**ఊర్కొండ, డిసెంబరు 21 ప్రభాతవార్త:** ఊర్కొండ మండలంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ఉంటున్న వృద్ధులకు, అనాథలకు పోలీసు కానిస్టేబుల్ వెంకోజీ దుప్పట్లు పంపిణీ చేసి తన దాతృత్వం చాటుకున్నారు. శీతాకాలంలో దేవాలయం వద్ద ఉంటున్న వృద్ధులకు, అనాథలకు శనివారం తన స్వంత డబ్బులతో ఉన్ని దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సంపాదనలో కొంత భాగాన్ని సమాజ సేవకు, అనాథలకు అభాగ్యులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. కరోనా సమయంలో సైతం రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని మండల గ్రామాలలో బాధిత కుటుంబాలకు ఆహారం, నిత్యావసర సరుకుల పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేయడంతో వారు హర్షం వ్యక్తం చేశారు.

## విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, స్టడీ మెటీరియల్స్ పంపిణీ



ప్యాడ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, డిసెంబరు 21 ప్రభాతవార్త:** క్లాస్మెట్ క్లబ్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడులు, స్టడీ మెటీరియల్స్ పంపిణీ చేశారు. నాగర్‌జిల్లాలోని వివిధ పాఠశాలలో రూ.12వేల విలువ గల పరీక్ష ప్యాడులు, స్టడీ మెటీరియల్స్ వాసరవి, బంధం రాజుల సహకారంతో అందించారు. ఈ కార్యక్రమంలో క్లాస్మేట్‌క్లబ్ వ్యవస్థాపకులు వాస రాఘవేందర్, రాష్ట్ర కార్యదర్శి కలిమిచెర్ల రమేష్, పరీక్షల అధికారి పి.రాజశేఖర్‌రావు, ఎపిఓ షర్ఫొద్దీన్, డిఎస్ ఓం రాజశేఖర్‌రావు, జిహెచ్ఎం నిర్మల పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనుల పరిశీలన



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం

**కల్వకుర్తి, డిసెంబరు21 ప్రభాతవార్త:** కల్వకుర్తి మున్సిపాలిటి పరిధిలో ఉన్న 13వార్డ్‌లో పిఎఫ్ ఐడిసి నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను శనివారం మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ ఎడ్మ సత్యం మాట్లాడుతూ కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులను నాణ్యతగా చేపట్టాలన్నారు. సకలంలో పూర్తి అయ్యే విధంగా మున్సిపాలిటికి సంబంధించిన అధికారులు పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ తలసాని జనార్ధన్‌రెడ్డి, నాయకులు తాహెర్‌అలీ, ముజీబ్, షకీల్, కాలనీ వాసులు విశ్వనాథం, రామస్వామి, సోమనాథం, బుచ్చయ్య, శివ, వేణు, సింహాయ్య, యాహియాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ కమిషనర్‌ను కలిసిన వెల్కిచర్ల ఎస్సీలు



ఎస్సీ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం సమర్పిస్తున్న వెల్కిచర్ల గ్రామ ఎస్సీలు

**భూత్పూర్, డిసెంబరు 21, ప్రభాతవార్త:** తమ గ్రామాన్ని ఎస్సీ రిజర్వుగా ప్రకటించి సర్పంచి ఎస్సీకే కేటాయించాలని కోరుతూ శనివారం హైదరాబాద్‌లోని తెలంఆణ ఎస్సీ కమిషన్‌లో కమిషనర్ బుక్కి వెంకటయ్యను భూత్పూర్ మండలం వెల్కిచర్ల గ్రామానికి చెందిన పలువురు ఎస్సీ సంఘం నేతలు, గ్రామ ఎస్సీ సామాజిక వర్గం సభ్యులు కమిషనర్‌ను స్వయంగా కలిసి వినతి పత్రం సమర్పించారు.

## ఫారెస్ట్ అధికారులకు చిక్కిన నక్క

సరైన ఆహారం దొరకక అనారోగ్యానికి గురైనట్లు ఫారెస్ట్ అధికారి వెల్లడి



నక్కను పట్టుకున్న ఫారెస్ట్ అధికారులు

**వనపర్తి క్రైమ్ డిసెంబరు 21 ప్రభాతవార్త:** అడవిలో స్వేచ్ఛగా సంచరిస్తూ కంట బడిన కళేబరాలను, జంతువులను వేటాడి తినే అడవి నక్క ఫారెస్ట్ అధికారులకు చిక్కింది. శనివారం కలెక్టరేట్‌కు వెళుతున్న డి.మాణిక్య రెడ్డి అనే వ్యక్తికి కలెక్టరేట్ సమీపంలో నక్క అతని కంటపడగా వెంటనే ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చాడు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ విజయకుమార్ తన సిబ్బందితో కలెక్టరేట్ సమీపానికి చేరుకొని నక్కను బంధించి పట్టుకున్నారు. గత కొన్ని రోజులుగా నక్కకు సరైన ఆహారం దొరకనందున బలహీనంగా మారి అనారో గ్యానికి గురైందని, అందుకే ఎటు కదలలేక ఒకే చోట నిలుచుందని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ తెలిపారు. బంధించిన నక్కకు వైద్యం, ఆహారం అందించి కోలుకున్న తర్వాత తిరిగి అడవిలో వదిలి పెడతామని తెలిపారు. సమాచారం తెలిపిన డి మాణిక్యం రెడ్డిని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అభినందించారు.